


సోమశిలలో 67.702 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 1,838 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 67.702 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



సౌత్‌మోపూరులోని కల్యాణమండపంలో జరిగిన చర్చావేదికలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సౌత్‌మోపూరుకు పండుగ!

పాలకులను కదలించిన ఆంధ్రజ్యోతి అక్షరం

- గ్రామానికి తరలివచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, అధికారులు
- అభివృద్ధికి రూ.కోటి కేటాయిస్తున్నట్లు ప్రకటన
- పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి నాయకులు, ప్రజల అభినందనల వెల్లువ

నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామం అది. మౌలిక సదుపాయాల లేమితో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఆ గ్రామవాసుల దీనావస్థను 'ఆంధ్రజ్యోతి' అక్షర రూపంలో వెలుగులోకి తెచ్చింది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నినాదంతో సౌత్‌మోపూరులో నెలకొన్న సమస్యలను సవివరంగా ప్రస్తావిస్తూ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనమే ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులను కదిలించింది. మంగళవారం ఉదయానికల్లా అందరూ సౌత్‌మోపూరు గ్రామానికి చేరిపోయారు.

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం సౌత్‌మోపురుకు పండుగను తెచ్చింది. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా నిలబడాలనే సంకల్పంతో 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్' మొదలు పెట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి తొలిరోజే ఫలవంతమైన ప్రయోజనాన్ని ఇచ్చింది. ఆంధ్రజ్యోతితో కష్టాలు పంచుకున్న సౌత్‌మోపూరు గ్రామవాసుల మొహాలలో చిరునవ్వులు పూయించింది. ఆంధ్రజ్యోతి అక్షరం మీద ఉన్న నమ్మకం, సౌత్‌మోపూరు వాసులపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ పల్లె కష్టాలు తీర్చడం కోసం సోదర సమేతంగా మంగళవారం ఉదయం 10 గంటలకే గ్రామానికి చేరుకున్నారు. గ్రామ సమస్యల చర్చా-పరిష్కార వేదిక వద్దకు చేరుకున్నారు. స్వయంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి గ్రామానికి తరలిరావడంతో గ్రామస్థుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఎమ్మెల్యే వచ్చారనే వార్త ఊరి చివరి పొలాల్లో ఉన్నవారిని సైతం చర్చా వేదిక వద్దకు రప్పించింది. సుమారు గంటకుపైగా ఎమ్మెల్యే సోదరులు ప్రజల సమస్యలను విన్నారు. రోడ్లు లేవని కొందరు.. డ్రైన్లు లేవని ఇంకొందరు.. కరెంటు సమస్యలపై మరికొందరు.. విషజ్వరాలు చుట్టుముడుతున్నాయని కొందరు ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.


తమ గ్రామం పట్ల ఎమ్మెల్యే చూపిన ప్రత్యేక అభిమానానికి, తమ సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేసుకొంటూ సంతోషంగా ఇళ్లకు తరలి వెళ్లారు. మొత్తమ్మీద 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం తొలిరోజే ప్రజలకు కొండంత సంతృప్తిని ఇచ్చింది.

10 రోజుల్లో పనులు

ప్రజల సమస్యలను మౌనంగా ఆలకించిన ఎమ్మెల్యే తన ప్రసంగాన్ని ఆరంభిస్తూ 'సౌత్ మోపూరులో సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికిప్పుడు కోటి రూపాయలు కేటాయిస్తున్నాను.' అని ప్రకటించడంతో గ్రామస్థుల కరతాళ ధ్వనులతో సమావేశ ప్రాంగణం మారుమ్రోగింది. 'ఈ కోటి రూపాయల పనులు ఎప్పుడో కాదు... రాసి పెట్టుకోండి పది రోజుల్లోపే మొదలు పెడుతాం!' అని ఎమ్మెల్యే గట్టిగా హామీ ఇవ్వడంతో గ్రామస్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ నిధులతో తొలుత సీసీ రోడ్లు, స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మిద్దాం. ఆ తరువాత దశలవారీగా మిగిలిన సమస్యలను పరిష్కరిద్దామని ఎమ్మెల్యే చెప్పడంతో ప్రజలు సంబరపడిపోయారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



కనికరించండి సార్!

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనట్టుగా మారింది నీరు-చెట్టు పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి. ఐదేళ్ల తర్వాత బిల్లులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తమ బాధలు తీరుతాయని ఆశపడ్డ కాంట్రాక్టర్లకు అధికారుల రూపంలో నిరాశ ఎదురవుతోంది. ఈ నెలాఖరులోపు బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ జిల్లాలో ఆశించిన స్థాయిలో అప్‌లోడ్ ప్రక్రియ జరగడం లేదు. కోర్టు కేసుల్లో ఉన్న బిల్లులు కూడా సకాలంలో అప్‌లోడ్ కావడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లలో మళ్లీ ఆందోళన మొదలైంది. తమ బిల్లులకు బ్రేక్ పడుతుందోనన్న భయంతో ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల వివరాలు...

సర్కిల్	మొత్తం వర్కులు	బిల్లులు (రూ.లక్షలు)	అప్‌లోడ్ చేయాల్సినవి	మొత్తం (రూ.లక్షలు)
ఇరిగేషన్ సర్కిల్	1823	13376.83	764	2477.09
సోమశిల ప్రాజెక్టు	566	5601.30	15	127.16
టీజీపీ	44	151.17	49	150.89
మొత్తం	2433	19129.30	828	2755.14

- ఐదేళ్ల తర్వాత నీరు-చెట్టు బిల్లులకు మోక్షం
- బకాయిలు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- నెలాఖరులోపు బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని ఆదేశం
- జిల్లాలో ఆశించిన వేగంగా అప్‌లోడ్ కాని బిల్లులు
- ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 2433 నీరు-చెట్టు పనులకు రూ.191.29 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో నీరు-చెట్టు పనులపై అనేక రకాల విచారణలు వేసి బిల్లులు చెల్లింపులో జాప్యం చేశారు. రెండేళ్ల తర్వాత నుంచి పనులు చేసిన వారు హైకోర్టు మెట్లెక్కడం మొదలుపెట్టారు. కోర్టు ఆదేశాలతో బిల్లులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరుగా కోర్టుకు క్యూ కట్టారు. ఇలా సగం మంది వరకూ తమ బిల్లులను తెచ్చుకున్నారు. ఇంకా కొన్ని కేసులు కోర్టులో పెండింగ్ ఉండగా, మరికొన్ని కోర్టు బయట ఉన్నాయి. ఇటువంటి పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించేందుకు ప్రభుత్వం గత నెలలో బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. అయితే ఆ బిల్లులను ఫైనాన్స్ వద్దకు పంపడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.



ప్రధానంగా నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోనే ఎక్కువగా బిల్లులు పెండింగ్ ఉన్నాయి. జిల్లా మొత్తం అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు 828 ఉంటే అందులో ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోనివి 764 ఉండటం గమనార్హం. ఇక్కడ కూడా ఆత్మకూరు డివిజన్ పరిధిలో 208, కావలి డివిజన్‌లో 225, గూడూరు డివిజన్‌లో 152, సెంట్రల్ డివిజన్ పరిధిలో 134 బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఈ పెండింగ్ బిల్లుల్లో కోర్టు పరిధిలో ఉన్నవి 143 ఉండడం గమనార్హం. ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా బిల్లులను వేగంగా అప్‌లోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇందుకుగానూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు మెమోలు కూడా జారీ చేస్తున్నట్లు వెల్లడించారు.

సమగ్ర నీటి వినియోగానికి జలగణన

- జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేయడానికి, తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించ డానికి జలగణన ఉపయోగపడు తుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. జిల్లాలో 7వ చిన్నతరహా నీటి వనరుల గణన, 2వ జలాశ యాల గణనను నిర్వహించేందుకు జిల్లాస్థాయి శిక్షణను మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పార్లమెంటు స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు జరుగుతున్న చిన్నతరహా నీటి వనరుల, జలాశయాల గణనను పక్కాగా నిర్వ హించాలన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా చేసే ఎన్యూమరేషన్‌లో మొత్తం 5 షెడ్యూల్స్ గ్రామ, పట్టణ, భూగర్భ జలవనరుల పథకాలు, ఉపరితల జలవనరుల పథకాలు, వాటర్ బాడీ షెడ్యూల్స్ గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిక్షణలో అన్ని విషయాలపై అవగాహన పెంచుకుని, మండల స్థాయిలో మిగిలిన వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో నరసింహారావు, ఏడీ ఆయేషా, ఎస్‌వో శ్యామ్‌కుమార్, వివిధ మండలాల ఏఎస్‌వోలు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, పక్కన అధికారులు

సహకార సంఘాల లావాదేవీలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలి

సహకార సంఘాల లావాదేవీలను ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిం చాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. మంగళవారం డీసీసీబీ సమావేశ మందిరంలో జరిగిన మహాజన సభలో ఆయన ప్రసంగించారు. సహకార సంఘాల కంప్యూటరీకరణ ఈ నెలాఖరుకు పూర్తవుతుందని చెప్పారు. సంఘాల్లోని సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీవో గురప్ప, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనలో మార్పులు

- డివిజనల్ అధికారుల నియామకానికి ప్రతిపాదనలు
- అన్ని విభాగాల్లోనూ పదోన్నతులకు కసరత్తు

నెల్లూరు(జడ్పీ), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కీలకమైన పంచాయతీ పాలనలో మార్పులకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు ప్రతిపాదనలు ఆహ్వానించింది. గత ప్రభుత్వంలో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. పంచాయతీలకు వచ్చే నిధులను సైతం వైసీపీ ప్రభుత్వం వాడుకుంది. దీంతో అటు సర్పంచులు,ఇటు ఉద్యోగులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇందులో భాగంగా అటు అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపడుతూనే, ఇటు పాలనలో మార్పులకు కసరత్తు చేస్తున్నది.

డివిజనల్ అధికారుల నియామకం

గ్రామాల్లో మెరుగైన పాలనా వ్యవస్థకి మార్పుల కోసం ప్రభుత్వం పంచాయతీ అధికారులు, పంచాయతీరాజ్‌కి చెందిన వివిధ సంఘాల నేతల నుంచి సూచనలు , సలహాలు తీసుకుంటున్నది. ఈ క్రమంలో రెండురోజుల క్రితం విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ అన్నీ జిల్లాల డీపీవోలు, ముఖ్య అధికారులు, వివిధ సంఘాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీ పాలనలో మార్పులకు వారి నుంచి సూచనలు తీసుకున్నారు. పంచాయ తీలకు డివిజనల్ అధికారుల (డీడీవో) వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు సూచించారు. జిల్లాలోని ప్రతి డివిజన్‌లో రెవెన్యూలో ఆర్డీవో, పోలీసుశాఖలో డీఎస్పీ ఉన్న విధంగా పంచాయతీలకు ప్రత్యేకంగా డీడీవో పోస్టును ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. అలాగే గ్రూప్ వన్ పోస్టును ఈ కేడర్‌కు కేటాయించేలా చూడాలని తెలిపారు. దీంతో డీపీవో, డీడీవో, డిప్యూటీ సీఈవోలు ఒకే ర్యాంకుకు చెందిన అధికారులు ఉండేలా చూడాల కోరారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంచాయతీరాజ్ కమిషనర్ ప్రభుత్వానికి పంపనున్నారు. డీడీవో పర్యవేక్షణలో గ్రామాలకు సంబంధించి అన్ని శాఖల అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. అలాగే పైస్థాయిలో పదోన్నతులు కల్పించడం ద్వారా కిందిస్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కలిగేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనే అవకాశం ఉన్నట్లు సమాచారం.



డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్



'సంక్షేమం'లో సాంకేతికత

కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవనశైలిని సులభతరం చేస్తోంది. డిజిటల్ విప్లవం పోనుపోను ఎన్నో ఆవిష్కరణలకు, అద్భుతాలకు నాంది పలకనుంది. రానున్న కాలంలో కుటుంబాలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచేది నేటి విద్యార్థులే. ఇటువంటివారికి సాంకేతిక విద్యను అందించాల్సిన ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న 9, 10 తరగతుల విద్యార్థులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఆ వసతి గృహాల్లో మెరుగైన వసతులతోపాటు సాంకేతిక విద్యాబోధన అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందుగా బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధనకు శ్రీకారం చుడుతోంది.

- వసతి గృహ విద్యార్థులకు డిజిటల్ బోధన
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లా
- తొలుత నాలుగు బీసీ హాస్టళ్లలో అమలు
- ప్రత్యేక గదిలో పరికరాలు
- రెండు రోజుల్లో ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి, ప్రయోగాత్మకంగా నాలుగు బీసీ వసతి గృహాల్లో తొలుత డిజిటల్ విద్యాబోధనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జిల్లాలో డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్ పేరుతో మహ్మదాపురం(బాలురు), పొదలకూరు(బాలికలు), ఆత్మకూరు(బాలికలు), కావలి(బాలురు) వసతి గృహాల్లో డిజిటల్ బోధన కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. అందులో కంప్యూటర్‌తోపాటు, భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను సిద్ధం చేశారు. ఈ బోధనకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించనున్నారు. జిల్లాలో 78 బీసీ సంక్షేమ శాఖ వసతి

- మిగతా 4లో

ఇది బస్‌షెల్టరేనా..!?



ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి వారికి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమ య్యారు. ఇక్కడున్న బస్‌షెల్టర్ అపరిశుభ్రతకు నిలయంగా మారి, దుర్గంధం వెదజల్లుతోంది. మందుబాబులు, యాచకులుకు అడ్డాగా మారింది. బస్‌షెల్టర్‌లో కూర్చునేందుకు బెంచీలు, ఇతర సామగ్రి అడ్డుగా ఉన్నాయి. ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకులతో కలిసి ఈ బస్‌షెల్టర్ దుస్థితి చూసి దుర్వాసన భరించలేక ముక్కుమూసుకున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్‌షెల్టర్‌ను శుభ్రం చేసి, మౌలిక వసతులు కల్పించి పలువురు కోరుతున్నారు.

-ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)





హరినాథపురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి రంగులు వేస్తున్న కళాకారులు

సుందర నగరం కోసం సొకులు

నగరంలో చేపట్టిన సుందరీకరణ పనులు నెల్లూరుకి కొత్తరూపును తీసుకువస్తున్నాయి. ఫ్లైఓవర్ల రోడ్డు పక్కన ఉన్న గోడలకు రంగురంగుల చిత్రాలు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. హరినాథపురంలో ఉన్న ఫ్లైఓవర్ నుంచి ఈ పనులు మొదలవడం ఆ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. ఈ రంగుల చిత్రాలు ఆహ్లాదకర వాతవరణాన్ని కల్పించడమే కాకుండా, ప్రజల్లో మంచి అనుభూతిని కలిగిస్తున్నాయి. ఈ చిత్రాలు కేవలం అందానికి మాత్రమే కాదు... స్థానిక సంస్కృతి, చరిత్ర, నైతిక సందేశాలను ప్రతిబింబించేలా ఉన్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అందంగా కనిపిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి





వన్యప్రాణులకు రక్షణ ఏదీ!?

- ఎనిమిదేళ్లలో ఐదు చిరుతల మృతి
- రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెద్ద పులి
- కుక్కల దాడిలో దుప్పులు.. మరికొన్ని వన్యప్రాణుల మృత్యువాత
- వివరాలు నమోదు చేయని అటవీ శాఖ
- వెలుగొండ అటవీ ప్రాంతంలో కరువైన రక్షణ కంచె

మర్రిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సువిశాలమైన వెలుగొండ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు రక్షణ కరువవుతోంది. వేటగాళ్ల నుంచి తప్పించుకుంటున్నా దాహం తీర్చుకోవడానికి బయటకు వస్తున్న మూగప్రాణులు వివిధ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో ఐదు చిరుతలు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాయి. వీటితోపాటు ఇతర జంతువులు నీటి కోసం గ్రామశివార్లలోకి వచ్చి కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. అయినా అటవీ అధికారులు మాత్రం మూగప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో హడావుడి చేసి ఆ తరువాత మరిచిపోతున్నారు. చనిపోయిన జంతువుల వివరాలు కూడా వారి వద్ద లేకపోవడం గమనార్హం.

రక్షణ చర్యలు ఏవీ ?

కాగా వెలుగొండ అటవీప్రాంతం తిరుపతి జిల్లా ఏర్పేడు-నకిరేకల్ జాతీయ రహదారి వైపు సింగన పల్లి నుంచి జిల్లా సరిహద్దు వరకు సుమారు ఆరు కిలోమీటర్లు, సరిహద్దు నుంచి నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి వైపు చుంచులూరు వరకు సుమారు 11కిలో మీటర్లు విస్తరించి ఉంది. అటవీ ప్రాంతంలో వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి రక్షణ కంచెను అధికారులు ఏర్పాటు చేయ లేదు. ప్రతిరోజూ ఎక్కడపడితే అక్కడ జంతువులు రోడ్డుకు ఇరువైపులా తిరుగుతూ ఉంటాయి. ఈ క్రమంలో వాహనాల రాకపోకలు సాగించేటప్పుడు ప్రమా దానికి గురవుతుంటాయి.



చనిపోయిన పులిని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

జంతుగణన ఏదీ?

అడవిలో ఏ జంతువులు ఎన్ని ఉన్నా యని అటవీ అధికారులను అడిగితే, అలాంటి లెక్కలు తమ వద్ద లేవని చెబుతు న్నారు. కేవలం పరిసర గ్రామాలవారి మాటల ఆధారంగా పలానా రకం జంతువులు ఇన్ని ఉన్నాయని చెబుతున్నారు. ఆ మాటలను ఉన్న తాధికారులు గుడ్డిగా నమ్మడం హాస్యాస్పదం.

గత సంఘటనలు

- 2018లో జిల్లా సరిహద్దులో నెల్లూరు-ముంబాయి రహదారిపై ఓ చిరుత మృతి చెందింది.
- 2022 మార్చిలో సింగన పల్లి సమీపంలో రోడ్డు దాటే క్రమంలో మరో చిరుత మృత్యువాత పడింది.
- 2023లో సింగనపల్లి వద్ద రోడ్డు దాటే క్రమంలో మరో చిరుత మృతి చనిపోయింది.
- 2024 మార్చిలో మరో చిరుత..
- 2025 జనవరి 27న మరో చిరుత మృతి చెందాయి.
- కోతులగుండం కనుమరుగు
  సింగనపల్లి అటవీ ప్రాంతంలో కోతులగుండం అనే పర్యాటక కేంద్రం గతంలో ఉండేది. వర్షాకాలం కొండల నుంచి ప్రవహిస్తున్న జలపాతాన్ని, ప్రకృతి అందాలను తిలకించేందుకు గతంలో వందలాది పర్యాటకులు వస్తుండేవారు. కాలక్రమీణా అది కనుమరుగు అయింది.

అడవి జంతువుల రక్షణ బాధ్యత వారిదే..



అడవి జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులదే. వేసవిలో నీటిఎద్దడికి తాళలేక అడవి సమీపంలో ఉండే గ్రామాల్లోకి, రోడ్లపైకి వస్తూ జంతు వులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రానున్న వేసవికాలంలో అయినా జంతువుల జాడను గుర్తించి నీటితొట్టిలు, గుంతలు ఏర్పాటు చేసి వాటిని కాపాడాలి.

- ఎం.రాయుడు, జంతు ప్రేమికుడు, మర్రిపాడు

చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి



ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం కాదు. నీటి కోసం అప్పుడప్పుడు అడవి జంతువులు గ్రామంలోకి వస్తుంటాయి. కొన్ని కుక్కల బారిన పడుతున్నాయి. అడవి చుట్టూ కంచె ఏర్పాటు చేసి వాటిని రక్షించి, మాకు ధైర్యాన్ని ఇవ్వాలి.

- నాగేశ్వరావు, స్థానికుడు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం

రోడ్డుపై వెళ్లే వాహనాలు నిదానంగా వెళ్లాలని వాహనదారులకు సూచిస్తున్నాం. రహదారి వెంబడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. అయినా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- శేఖర్, ఆత్మకూరు అటవీ రేంజర్

ఫోర్జరీపై కేసు నమోదు

- రూ.8 లక్షలు తీసుకొని దొంగ ప్రొసీడింగ్స్ తయారీ

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ సంతకం ఫోర్జరీ వ్యవహారంలో ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ముగ్గురిని నిందితులుగా చేరుస్తూ దర్గామిట్ట పోలీసులు ఎఫ్‌ఐఆర్ కట్టారు. 'ఇంత బరితెగింపా!?' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. దీంతో మంగళవా రం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తహసీల్దార్ ఈ నెల 26వ తేదీన ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్‌ఐఆర్‌లో మాత్రం 28వ తేదీన ఫిర్యాదు చేసినట్లు నమోదు చేయడం గమనార్హం. తహసీల్దార్ ఫిర్యాదు, పోలీసుల కేసు నమోదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బల్లి జయప్రసాదరావు, వడియార సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు జాయింట్ కలెక్టర్ సంతకంతో ఉన్న ప్రొసీడింగ్ కాపీని నెల్లూరు రూరల్ తహసీల్దార్‌కు ఈ నెల 17న అందజే శారు. ఆ ప్రొసీడింగ్స్‌లోని ఆర్డర్స్ మేరకు చందలారు కేశవరావు పేరుపై ఉన్న కనుపర్తిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 115-2-1లోని 4.25 ఎకరాల భూమి అడంగల్ కరెక్షన్ చేయాలని కోరారు. ఈ నెల 23వ తేదీన ఈ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించిన తహసీల్దార్.. ఆ ప్రొసీడింగ్స్‌పై ఉన్న ఫైల్ నంబర్ మీద అనుమానంతో ప్రొసీడింగ్స్‌ను ఈ-డిస్ట్రిక్ మేనేజర్‌కు పంపి పరిశీలించమని కోరారు. కలెక్టరేట్‌లోని సంబంధిత సెక్షన్‌లో పరిశీలించగా ఆ ఫైల్ నంబర్‌తో అసలు ఏ ప్రొసీడింగ్స్ జారీ చేయలేదని నిర్ధారించారు. దీంతో అది ఫోర్జరీ ప్రొసీడింగ్ అని అంచనాకు వచ్చిన అధికారులు విష యాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 24న వడియార సురేష్, బల్లి జయప్రసాదరావు, చందలారు కేశవరావును కలెక్టరేట్‌కు పిలిపించి విచారించారు. వారి స్టేట్‌మెంట్ ఆధారంగా సదరు ఫోర్జరీ డాక్యుమెంట్ పీ ధనుంజయ అనే వ్యక్తి నుంచి వచ్చిందని తేల్చారు. అతడికి కోవూరుకు చెందిన కంద మహేంద్ర అనే వ్యక్తి పంపారని నిర్ధారించుకు న్నారు. ఇందుకు రూ.8 లక్షల నగదు తీసుకున్నట్లు కూడా విచారణలో వెల్లడైంది. అయితే మహేంద్ర అనే వ్యక్తి ఆ ఫోర్జరీ డాక్యుమెంట్‌తో తనకు సంబంధం లేదని ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్‌లో అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. వీటన్నింటి నేపథ్యంలో నిజనిజాలు తేల్చి జాయింట్ కలెక్టర్ సంతకంతో ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లాజరస్ ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏ1గా మహేంద్ర, ఏ2గా ధనుంజయ, ఏ3గా చందలూరు కేశవరావు, మరొకందరు అని ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

ఇంటర్ తత్కాల్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

నెల్లూరు(విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థుల సౌకర్యం కోసం తత్కాల్-2 పథకం కింద రూ.3వేలు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు బుధవారం తుది గడువుగా ఇంటర్‌బోర్డు అవకాశం కల్పించిందని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ సమాచారాన్ని విద్యార్థులకు తెలియచేసి చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గొంతు చించుకోవద్దు..
మీ అక్రమాలు గుర్తుంచుకోండి

- కాకాణి, చంద్రశేఖర్‌రెడ్డికి కోటంరెడ్డి కౌంటర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : 'గొంతు చించుకుని మీరు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. గతంలో చేసిన అక్రమాలను గుర్తు తెచ్చుకోండి' అంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్ర శేఖర్‌రెడ్డి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కౌంటర్ ఇచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరులోని బాలాజీ నగర్‌లో వైసీపీ నేత బాలకృష్ణారెడ్డికి చెందిన అక్ర మ కట్టడాన్ని అధికారులు కూల్చేశారన్నారు. రూ.3కోట్ల విలువైన కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి బిల్డింగ్ నిర్మిస్తే సైలెంట్‌గా ఉండాలా... అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం కూల్చివేయడంపై కాకా ణి, చంద్రశేఖర్ రెడ్డి గొంతు చించుకుని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అక్రమ కట్టడాన్ని కూల్చేస్తే అధికారులను బెదిరించ డం తగదన్నారు. టీడీపీ నేత జహీర్ ఇళ్లు కూల్చేసి నప్పుడు కాకాణి, చంద్రశేఖర్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పోలీసులను అడ్డు పెట్టుకుని మీలా విధ్వంసాలకు పాల్పడటం లేదని పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు. కాకాణి అరాచకాలు సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం తెలుసన్నారు. మంత్రి నారాయణను విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, కువ్వారపు బాలాజీ, అంచూరు శ్రీనివాసులు నాయుడు, జహీర్, కోకు మహేంద్రరెడ్డి, ఆకుల హనుమంతరావు, తంబి, సుజన్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

సంగం, జనవరి 28: మండలంలోని పెరమనకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. యువతి డిగ్రీ పూర్తి చేసి, కొంత కాలంగా ఇంట్లో ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం యువతి తండ్రి అన్నం తిని నిద్రపోయి లేచేటప్పటికి కనిపించలేదు. బం ధువులు, స్నేహితుల ఇళ్లను పరిశీలించారు. కానీ ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



సింహపురి సాంస్కృతిక ఉత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

బడాబాబులకు దేశ సంపదను
దోచిపెడుతున్న ప్రభుత్వాలు

- అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

నెల్లూరు (వైద్యం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలకు దేశసంపదను దోచిపెట్టే విధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి విమర్శించారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని నెల్లూరులో రెండోరోజు మంగళవారం కూడా సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆమె నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో ఎంతో వైభవంగా సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వారసులుగా ఎంతో ఉత్తేజం పొందిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నో ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఉన్న సంపదను పారిశ్రామిక వేత్తలు అదానీ, అంబానీలకు దోచి పెట్టేలా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలన సాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తామని, ప్రపంచ బ్యాంకుకు ఊడిగం చేస్తున్న నేతలు నేడు గద్దె నెక్కి ఉన్నారన్నారు. ఈ పరిస్థితిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 45 ఏళ్ల క్రితం ఈ గడ్డ మీద జరిగిన సీపీఎం మహాసభను కళ్లారా చూశామన్నారు. మళ్లీ వచ్చేనెలలో నెల్లూరులో జరిగే మహాసభలను చూస్తామన్నారు. బాబ్రీ మసీదు పడగొట్టిన తర్వాత మతసామరస్యానికి విఘాతం కలిగించకూడదన్న ఉద్దేశంలో జక్కా వెంకయ్య పార్టీ జెండా పట్టుకుని జిల్లా అంతటా తిరగారన్నారు. సారాఉద్యమాన్ని జిల్లాలో వామపక్షాలే చేపట్టాయని గుర్తు చేశారు. రాబోయే కాలంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొవాల్సి వస్తుందని తెలియచేశారు. ఈ నేపథ్యంలో సీపీఎం మీద ఎన్నో బాధ్యతలు ఉన్నాయన్నారు. సభా అధ్యక్షురాలు రెహనాబేగం తదితరులు మాట్లాడారు. అనంతరం కళాకారులకు నేతలు మెమొంటోలు అందచేశారు. ఈ సంద ర్భంగా నెల్లూరు సిటీ జానపద కళాకారుల కోలాటం, యల్లాయపాళెం గిరిజనుల నృత్యం, డప్పుల విన్యాసం, బుజ బుజనెల్లూరు కళకారుల నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్ర మంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వేణు, ప్రముఖ రచయితలు ఈతకోట సుబ్బారావు, గంగిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌సీడీసీ సర్వేను వేగవంతం చేయండి

- అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి



పిడూరులో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

మనుబోలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎల్‌సీడీసీ (కుష్ఠు వ్యాధి) సర్వేను వేగవంతం చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్‌సీడీసీ సర్వే గురించి సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలో ఇప్పటి వరకు 11వేల ఇళ్లు సర్వే చేశామని, ఇంకా 5వేల ఇళ్లు చేయాల్సి ఉందని వైద్యురాలు మొహసీనా సుల్తానా తెలిపారు. ఫిబ్రవరి 2 నాటికి నూరుశాతం సర్వే పూర్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం పిడూరు గిరిజన కాలనీలో సర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దూబగుంటలో పొగాకు బ్యారన్ దగ్ధం



దూబగుంటలో దగ్ధం అవుతున్న పొగాకు బ్యారన్

కందుకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంటకు చెందిన దామా మల్లేశ్వరరావు, దామా మాధవరావులకు చెందిన ఉమ్మడి బ్యారన్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. క్యూరింగ్ జరుగుతున్న సమయంలో అగ్నిప్రమాదం సంభవించి 1100 కర్రలు పొగాతో వాటిని ఏర్పాటుకు ఉపయోగించిన టైర్లు, కర్ర, గొట్టాలు, పైకప్పు కాలిపోయినట్లు చెప్పారు. బ్యారన్ పూర్తిస్థాయిలో పనికి రాకుండా మొండిగోడలు మాత్రమే మిగిలాయని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న కందుకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు పక్క బ్యారన్లకు రాకుండా చర్యలు తీసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్కనగిషీ కేంద్రం
అభివృద్ధికి చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



కళాకారులు తయారు చేసిన కొయ్య వస్తువులను పరిశీలిస్తున్న పీడీ నాగరాజకుమారి

ఉదయగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధికి అన్నీ చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి నాగరాజ కుమారి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కో-ఆర్డినేటర్ అరుణకుమార్‌తో కలిసి ఆమె చెక్కనగిషీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వసతులు, యంత్రాలు, మహిళా కళాకారులు తయారు చేసిన వస్తువులు పరిశీలించి నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్, గౌసియాబేగంతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ వన్‌డిస్ట్రిక్-వన్ ప్రొడక్ట్‌లో భాగంగా చెక్కనగిషీ కేంద్రం అభివృద్ధికి ఏం చర్యలు చేపట్టాలి, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందించాలనే అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ కేంద్రంలో ఎక్కువమందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం మంజూరు చేయాలని విన్నవించారు.

- నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆమె పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందిన వీవోఏలు, వలంటీర్లు క్రమం తప్పకుండా ప్రతినిత్యం కేంద్రాలను నిర్వహించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమం'లో సాంకేతికత

(3వ పేజీ తరువాయి)

గృహాలు ఉండగా వాటిలో నాలుగు వేలమంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. కాగా, తొలుత నాలుగు హాస్టళ్లలో డిజిటల్ బోధనా సెంటర్లు ఏర్పాటు చేయగా ఇది విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నీ వసతి గృహాల్లో ఆ బోధనను అంచెలంచెలుగా అమలు చేయనున్నారు.

- సొంత భవనాలకు మరమ్మతులు



రిసోర్సు సెంటర్‌లో ఏర్పాటు చేసి పెద్ద ఎల్ఈడీ స్ర్కీన్

జిల్లాలో గత వైసీపీ పాలనలో వసతి గృహాల్లో అభివృద్ధి మృగ్యమైంది. హాస్టళ్ల నిర్వహణను నాటి పాలకులు గాలికి వదిలేశారు. విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు సైతం చెల్లించలేదు. 2018 నాటి ధరలతోనే మెనూను అమలు చేయటంతో ఆ ప్రభావం ఆహార నాణ్యతపై పడింది. వార్డెన్లకు బిల్లులు చెల్లించకపోవటంతో వారు మెనునూ సక్రమంగా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. దీంతో వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కూటమి ప్రభుత్వం కొలువైన తరువాత వసతి గృహ భవనాల మరమ్మతులకు నివేదిక తెప్పించుకుంది. జిల్లాలో 34 ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులకు రూ.78 లక్షలు ఖర్చవుతుందన్న అధికారుల అంచ నాకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వసతిగృహాలు త్వరలో కళకళలాడనున్నాయి.

రెండు రోజుల్లో ప్రారంభం



జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు బీసీ వసతి గృహాల్లో డిజిటల్ విద్యా బోధనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం హాస్టళ్లలో ఒక గదిని ప్రత్యేకంగా రూపొందించాం. ఆ గదిలో కంప్యూటర్, ఎల్ఈడీ స్ర్కీన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయించాం. ఇందుకు ప్రభుత్వం రూ.4.45 లక్షలు కేటాయించింది. రెండు రోజుల్లో బోధనా కార్యక్రమాలు ప్రారంభిస్తాం. దీనిని వసతిగృహ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- వెంకట లక్ష్మమ్మ, జిల్లా బీసీ సంక్షేమాధికారి

న్యూస్ బాక్స్

కలప తరలింపుపై పంచాయతీ తీర్మానం

మర్రిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పొంగూరు గ్రామస్థులు సోమశిల హైలెవెల్ కెనాల్ కట్టపై ఉన్న కలపను అక్రమంగా నరికి విక్రయించారు. ఈ విషయమై ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో 'యథేచ్ఛగా కలప తరలింపు' శీర్షికన కథనం రావటంతో తెలుగుగంగ అధికారులు స్పందించారు. హైలెవెల్ కెనాల్ కట్టను పరిశీలించి, గ్రామంలో విచారించారు. అక్కడ పనులు 62శాతం పూర్తి చేయగా, అటవీ శాఖ, భూసేకరణ పనులు పెండింగ్ దృష్ట్యా పనులు ఆగాయి. దీంతో తమకు తెలియకుండా స్థానికులు ఆ చెట్లను విక్రయించి, వచ్చిన నగదును ఆలయానికి ఉపయోగించుకున్నట్లు తేలింది. తమ శాఖకు తెలియకుండా కంప చెట్లు నరకడం సరైంది కాదని, ఇక మీదట ఆ చెట్లను నరకబోమని పొంగూరు గ్రామసభలో తీర్మానం చేయించినట్లు తెలుగుగంగ 4వ డివిజన్ (గూడూరు) ఈఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులకు మెమోల జారీ

ఉదయగిరి : సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధి ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో అప్పాజీ మంగళవారం తెలిపారు. శని వారం ఆంధ్రజ్యోతిలో 'ఆ ఉద్యో గుల రూటే సెపరేటు' అనే కథనం ప్రచురితమైంది. స్పందిం చిన డ్వామా పీడీ గంగాభవాని ఉద్యో గులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీ వోను ఆదేశించారు. ఈ మేర కు వారికి మెమోలు జారీ చేసి నివేదిక పంపామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారులు చేపడతారని ఆయన తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వేదాయపాళెం రైల్వే గేటు సమీపంలో మంగళవారం గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 30 నుంచి 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయి. రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయప డటంతో మరణించాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20 సీసాల మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పప్పులవీధిలో శ్రీరామ మందిరం వెనుక అక్రమంగా మద్యం విక్రయి స్తున్న క్రాంతి అనే వ్యక్తిని మంగళ వారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు పట్టుకున్నారు. అతనిని అరెస్ట్ చేసి 20 సీసాల మద్యం స్వాధీనం చేసుకు న్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ప్రభాకర్ రావు, కానిస్టేబుల్ ఎం రాజాజీ పాల్గొన్నారు.

చోరీపై ఆలస్యంగా ఫిర్యాదు

సంగం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తాపురంలో అయ్యమ్మ అనే వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఈనెల 15న గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. రాత్రి వేళ నిద్రపోతుంటే లాక్కెళ్లారు. కానీ ఆమె ఇన్ని రోజులు ఫిర్యాదు చేయకుండా మంగళవారం ఫిర్యాదు చేసింది. చోరీకి గురైన బంగారు చైన్ రెండు సవర్లు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	126
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	248
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7754
వెండి కిలో ధర	రూ. 92,400
వెండి ఒక గ్రాము	రూ.95.40

సౌత్‌మోపూరుకు రూ.కోటి

- అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నా
- పది రోజుల్లో శంకుస్థాపన చేస్తా
- పనులు ఎప్పటికి పూర్తి చేస్తామో అప్పుడే చెప్తా!
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
- 'ఆంధ్రజ్యోతి' చొరవకు దక్కిన ఫలితం



సౌత్‌మోపూరులో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



పది రోజుల్లో పనులు ప్రారంభిస్తున్నాం 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పేరుతో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' తలపెట్టిన కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో కొత్త అధ్యాయం. సౌత్‌మోపూరులో వివిధ సమస్యల పరిష్కారా నికి రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నాం. మరో ఆరు నెలలు, సంవత్సరం అని కాకుండా వచ్చే నెల 8వ తేదీనే రూ.కోటి పనులకు శంకుస్థాపన చేస్తా. ఎప్పటి లోపు పనులు పూర్తి చేసేది కూడా తెలియజేస్తాం. సౌత్‌మోపూరు, ములుమూడి గ్రామాలు నాకు రెండు కళ్లు లాంటివి. నాకు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా ఈ గ్రామాలు నన్ను అక్కున చేర్చుకున్నాయి. ఇక్కడ పార్టీ ఓటింగ్‌తో సంబంధం లేకుండా నాకు సొంత అభిమానులు ఉన్నారు. గ్రామస్థులు అనేక సమస్యలు చెప్పారు. వాటన్నింటినీ పరిష్కరిస్తా. ఇప్పటికే నెల్లూరు-తాటిపర్తి రోడ్డు అభివృద్ధి పనులు చివరి దశకు వచ్చాయి. నిధుల లభ్యతను బట్టి ప్రతీ సమస్యను పరిష్కరిస్తాము.' అని అన్నారు. కాగా సౌత్‌మోపూరు నుంచి తాటిపర్తి రోడ్డు వరకు వీధి లైట్లు లేకపోవడంతో రాత్రివేళల్లో రాకపోకలు ఇబ్బందిగా మారాయని గ్రామస్థులు చెప్పడంతో ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. సాయంత్రంలోపు విద్యుత్ శాఖ అధికారులు వచ్చి సమస్యను పరిశీలిస్తారని, ఆ తర్వాత తాను అధికారులతో మాట్లాడి లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

'సౌత్ మోపూరు గ్రామంలో మౌలిక సదుపాయల కల్పన కోసం కోటి రూపాయలు కేటాయిస్తున్నాం. ఈ నిధులతో రోడ్లు, డ్రైన్లు, స్కూల్ ప్రహరీ గోడ వంటి నిర్మాణాలు చేపడతాం. పది అంటే పది రోజుల్లోనే ఈ పనులకు శంకుస్థాపనలు జరుగుతాయి. ఆ వెంటనే పనులు ప్రారంభమవుతాయి. ఆ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తామనే విషయం కూడా మీకు ముందుగానే ప్రకటిస్తాం.' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సౌత్‌మోపూరు వాసులకు హామీ ఇచ్చారు. 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా..' అనే నినాదంతో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆరంభించిన అక్షర యజ్ఞంలో సౌత్‌మోపూరు గ్రామంలో నెలకొన్న సమస్యలు, వాటి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ ఓ కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డిని కదిలించింది. మంగళవారం సౌత్‌మోపూ రులో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన చర్చా వేదికకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు, తెలుగుదేశం నాయకుడు గిరిధర్‌రెడ్డి మండల అధికారులను వెంటబెట్టుకొని వచ్చారు. ప్రజల సమ స్యలు సావధానంగా విని, వాటి పరిష్కా రానికి వెంటనే కోటి రూపాయలు కేటా యిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజల కోసం ఆంధ్రజ్యోతి చేస్తున్న ప్రయత్నాన్ని గొప్పగా అభినందించారు.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి



గ్రామంలోని అన్ని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి తమ శక్తి మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాము. నిధుల ఇబ్బందులతో కొంతమేర అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గతంలో విడులైన కొన్ని నిధులతో తాము పనులు చేపట్టి పూర్తి చేశారు. ఇంకా చాలా సమస్యలు ఉన్నాయి. ఎమ్మెల్యే, అధికారుల సహకారంతో వాటిని పూర్తి చేస్తాం.

- గల్లా నర్సయ్య, పంచాయతీ ఉప సర్పంచి

ఎన్నో సమస్యలున్నాయ్!



సౌత్‌మోపూరులో అనేక సమస్యలు ఉన్నాయి. సీసీరోడ్లు, డ్రైన్లు, శ్మశానంలో ప్రహరీ గోడ, పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణాలు ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. గతంలో మా గ్రామంలో అనేక సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే ఈ సమ స్యలను పరిష్కరిం చాలని కోరుతున్నాను.

- రాపూరు చంద్రశేఖర్, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్

అన్నీ రాసుకున్నాం.. పరిష్కరిస్తాం!



సౌత్‌మోపూరు గ్రామస్థులు చెప్పిన ప్రతి సమస్యను రాసుకున్నాం. అన్నిటినీ పరిష్కరిస్తాము. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం నిర్వహణకు జిల్లాలో మొదట రూరల్ నియోజకవర్గాన్ని ఎంచుకోవడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్లక్ష్యం చేశారు. సర్పంచ్‌ల అధికారాలు, పంచాయతీల నిధులను లాగేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. సౌత్‌మోపూరు గ్రామం మా సొంతూరు లాంటిది. శ్రీధర్‌రెడ్డి స్ఫూర్తితో గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా.

- కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, టీడీపీ నేత

డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి



గ్రామంలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా వీవర్స్‌కాలనీలో సైడు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పూడికలు తీయకపోవడంతో ఈ ప్రాంతంలో మురుగునీరు చేరిపోయి దుర్గంధ భరితంగా మారింది. అస్తవ్యస్త డ్రైనేజీ కారణంగా దోమలతో ఇబ్బందులు పడుతున్నాము. దీనిపై అధికారులు వెంటనే దృష్టి సారించి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాలి.

- శ్రీనివాసులు, జనసేన నాయకుడు

ప్రహరీ గోడలు నిర్మించాలి



మా గ్రామంలో మూడు శ్మశాన వాటికలు ఉండగా ఓసీల శ్మశాన వాటికకు మాత్రమే ప్రహరీ గోడ నిర్మించారు. కలుజుమిట్టలో ఎస్టీలకు, గ్రామ ప్రధాన శ్మశాన వాటికకు, పక్కనే ఉన్న మొగళ్లపాలెం గ్రామానికి చెందిన శ్మశాన వాటికకు ప్రహరీ గోడలు నిర్మించ లేదు. మా యందు దయ ఉంచి ఈ మూడు శ్మశాన వాటికలకు ప్రహరీ గోడలను నిర్మించాలి.

- సుధాకర్

విషజ్వరాల బారిన పడుతున్నాం



ఈ గ్రామంలో ముఖ్యంగా రోడ్ల సమస్య ఉంది. చౌడమాను సెంటర్‌లో గ్రామస్థులు ఉదయం, సాయంత్రం అక్కడకు చేరుకొని అక్కడ నుంచే పనులకు వెళుతుంటారు. అయితే, వర్షాలు కురిస్తే ఆ ప్రాంతం మురుగునీటితో చెరువును తలపిస్తూ ఉంటుంది. అక్కడ నుంచి బస్టాండు వరకు డ్రైన్‌లు సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో మా గ్రామంలో ఎంతో మంది జ్వారాల బారిన పడ్డారు. ఇద్దరు చనిపోయారు కూడా. రోడ్లపైకి వస్తున్న మురుగు వల్లే విషజ్వరాలు వచ్చాయని మేము భావిస్తున్నాము.

- విజయ్, సౌత్‌మోపూరు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



గ్రామంలోని శివాలయం నుంచి కముజులమిట్ట వరకు రోడ్డులేక గ్రామ ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మట్టి, గుంతల రోడ్డులోనే నిత్యం వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలం వస్తే ఈ ప్రాంతం చెరువును తలపిస్తూ గుంతలు ఏర్పడటం, నీరు నిలిచిపోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మిస్తే ప్రజలందరికీ ఉపయుక్తంగా ఉంటుంది. అలాగే ఈ ప్రాంతంలో ప్రభుత్వం కట్టించిన ఇళ్లకు కూడా వసతులు కల్పించాలి.

- శీనయ్య

విద్యుత్ సమస్య పరిష్కరించండి!



గ్రామంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా బీసీ కాలనీ పరిధిలో రాత్రి సమయాల్లో లైట్లు వెలగక నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాము. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మూగజీవాలు సైతం విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. దీనిపై వెంటనే స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి.

- మురళి

అస్తవ్యస్తంగా రహదారులు

మా ప్రాంతంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. నడిచేందు కు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నాము. ప్రధానంగా వర్షాల సమయంలో మేము పడే బాధలు చెప్పలేం. రాత్రి సమయాల్లో లైట్లు కూడా వెలగకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిపై ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డును సరిచేసి విద్యుత్‌ను కూడా ఏర్పాటు చేయాలి.

- పెళ్లూరు రవీంద్ర

హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాలి



మా గ్రామంలోని హైస్కూల్‌కు పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్నాను. మా పాఠశాలలో 200 మీటర్లకుపైగా ప్రహరీ గోడ కూలిపోయి ఉంది. తరగ తి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారు. ప్రహరీ నిర్మించి, తరగతి గదుల్లో స్లాబ్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నాను.

- పెంచలయ్య, హైస్కూల్ చైర్మన్

వర్షం కురిస్తే నడక కష్టం

గ్రామంలో శివాలయం దగ్గర నుంచి కలుజులమిట్ట రోడ్డు వర్షాకాలంలో చిత్తడి చిత్తడిగా ఉంటుంది. ఇక్కడ రోడ్డు నిర్మిస్తే ప్రజలందరూ సంతోషంగా రాకపోకలు సాగిస్తారు.

- రమణయ్య, కముజులమిట్ట కాలనీ

విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలి



మా గ్రామంలో రాత్రి పూట తాడిపర్తి బస్సు దిగిన ప్రజలు చీకట్లో ఊళ్లోకి నడుచుకుంటూ రావడం ఇబ్బందిగా ఉంది. మోపూరమ్మ దేవాలయం నుంచి సీల్డ్ రోడ్డు వరకు స్తంభాలు ఏర్పాటు చేసి బల్బులు అమరిస్తే అందరికీ బాగుంటుంది.

- రవీంద్ర

పాల్గొన్నది వీరే : ఎంపీపీ విజయ్‌కుమార్, తహసీల్దారు లాజరస్, ఎంపీడీవో శైలేంద్రకుమార్, పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచి పోలయ్య, ఎంపీటీసీ చెంచమ్మ, ఉపసర్పంచి నరసయ్య, హైస్కూల్ చైర్మన్ పెంచలయ్య, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ బ్రాంచ్ మేనేజరు కే.హరికృష్ణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు





అయ్యా మా సమస్యలూ ఆలకించండి : ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న స్థానికులు, మహిళల బాధలు విని భరోసా ఇస్తున్న గిరిధర్‌రెడ్డి

మంచు ఎఫెక్ట్!

- రెండు వంతెనల మధ్యలోకి దూసుకెళ్లిన లారీ

అర్ధరాత్రి సమయంలో కురుస్తున్న మంచు ప్రమాదాలకు కారణమవుతోంది. పక్క పక్కన ఉన్న మనుషులే ఒకరికొరు కనిపించని రీతిలో ఉన్న మంచు జాతీయ రహదారిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అందుకు నిదర్శనమే మంగళవారం తెల్లవారు జామున మనుబోలు మండల పరిధిలోని కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఓ లారీ అదుపుతప్పి రెండు వంతెనల మధ్యలోకి దూసుకెళ్లడమే. గూడూరులోని ఓ రొయ్యల కంపెనీకి చెందిన మినీలారీ ఐస్ లోడ్‌తో వెళుతుండగా మంచుతెరలతో రోడ్డు సరిగా కనపడకపోవడంతో అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. అంతే వేగంతో రెండు వంతెనల మధ్యలో దిగి ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ తిరుపాలు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్‌ల సాయంతో లారీని బయటకు తీయించారు.



రెండు వంతెనల మధ్యలో ఇరుక్కున్న లారీ

- మనుబోలు,(ఆంధ్రజ్యోతి)

ముగిసిన క్రీడా పోటీలు

వెంకటాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో రెండు రోజులుగా ఉత్సాహంగా జరిగిన ఇంటర్-కాలేజియేట్ పురుషుల క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్ర మంలో వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని గెలుపొందిన జట్లకు కప్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ వెంకటరాయులు, డాక్టర్ పీ నారాయణరాజు, పీడీ డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు : బాస్కెట్ బాల్ విన్నర్ జేబీ డిగ్రీ కళాశాల(కావలి), రన్నర్ వీఎస్‌యూ కళాశాల, చెస్‌లో విన్నర్ జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల (నెల్లూరు), రన్నర్ వీఎస్‌యూ కళాశాల, సాఫ్ట్‌బాల్‌లో విన్నర్ డాక్టర్ ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల (ఆత్మకూరు), రన్నర్ వీఎస్‌యూ కళాశాల, హ్యాండ్‌బాల్‌లో విన్నర్ జేబీ డిగ్రీ కళాశాల (కావలి), రన్నర్ వీఎస్‌యూ కళాశాల, ఉత్తమ శరీరాకృతి (బెస్ట్ ఫిజిక్)లో విన్నర్ వీఎస్‌యూ కళాశాల, రన్నర్ జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల (నెల్లూరు) నిలిచారు.



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

ఏవీఎస్ రాష్ట్ర మహాసభల బ్రోచర్ ఆవిష్కరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) రాష్ట్ర మహాసభల బ్రోచర్‌ను నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆవిష్కరించారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1వ తేదీన విశాఖపట్నంలో మహాసభలు జరుగునున్నాయని చెప్పారు. విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విదార్థి సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెక్కడి స్వచ్ఛభారత్?

● అల్లూరు నగర పంచాయతీలో చెత్త సేకరణ సమస్య

● ఎక్కడికక్కడి కుప్పలు పోసి తగలేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రభుత్వాలు, ప్రభుత్వ పెద్దలు కంటున్న కలలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అల్లూరు నగర పంచాయతీలో చెత్త సమస్య తీవ్రతరం దాల్చుతోంది. గ్రామాల్లో పేరుకున్న చెత్తను స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అధికారులు విభిన్నంగా వ్యవహరిస్తున్నారు. వీధుల్లోని చెత్తను తొలగించి దూరప్రాంతంలోని డంపింగ్ యార్డుల్లో పడేయాల్సి ఉన్నప్పటికీ గ్రామాల శివార్లలో వేసి తగులబెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వాతావరణ కాలుష్యం తీవ్రం అవుతుంది. అటుగా వెళ్లే వాహనదారులు ముక్కులు, కళ్లు మూసుకొని వాహనాలు నడపాల్సి వస్తోంది. అదేవిధంగా నార్తు మోపూరులో ఏర్పడిన చెత్తను ప్రధాన కూడలిలో పడేస్తున్నారు. విపరీతంగా ఈగలు, దోమలు చేరి చుట్టుపక్కల వారు వ్యాధులబారిన పడేలా చేస్తోందంటూ గ్రామస్థులు వాపోతున్నారు. నగర పంచాయతీగా మారితే అభివృద్ధి జరుగుతుందని భావించిన అప్పటి పాలకులకు నేడు ప్రజలు పడుతున్న అవస్థలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. చెత్తను నియంత్రణలో నగర పంచాయతీ అధికారులు విఫలం అవుతున్నారని విమర్శిస్తున్నారు. వాతావరణ కాలుష్యంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని.. ఇలా అయితే స్వచ్ఛభారత్ సాధ్యమేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.



నార్తుమోపూరులోని ప్రధాన కూడలిలో పడేసిన చెత్త

న్యూస్ బాక్స్

రేపు మండల సమావేశం

వలేటివారిపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రదేవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు.

రేషన్ అందించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు సీతామహాలక్ష్మి

లింగసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను ప్రతిఒక్క లబ్ధిదారుడికి అందేలా చూడాలని తహసీల్దారు సీతామహాలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశం జరిగింది. కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్యతో కలిసి ఆమె మాట్లాడారు. ఎండీయూ ఆపరేటర్లు ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచే నిర్దేశించిన రేట్లకే సరుకులు ఇవ్వాల న్నారు. షాపు బయట బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ రమణయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి పోలేరమ్మకు మంగళవారం కడనూతల దళితవాడ చెందిన ప్రజలు మేళతాళాలు, మంళవాయిద్యాలతో నైవేద్యాలను తీసుకొచ్చి అమ్మవారి దర్శించుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించి పూజలు చేశారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఉదయగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సిమెంట్‌రోడ్డు పనులను సర్పంచ్ సామ్రాజ్యం, ఉప సర్పంచి షేక్ ముర్తుజా హుస్సేన్ ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు ఉప్పుటూరి శ్రీనివాసులు, రియాజ్, ఉప్పుటూరి హరి,మాబాషా, యస్థాన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సీతారామపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమా వేశంలో శాఖలవారీ అభివృద్ధి కార్యక్రమా లపై సమీక్షిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరవాలన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం మనోహర్‌రావు, కేజియమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మనోజ్ క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీఈటీ వెంకటేశు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

కావలి రూరల్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని రెండు బెల్టు దుకాణాలపై మంగళవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మద్యం అమ్మకాలు సాగిస్తున్న పరుసు సుకుమార్, సురేష్‌లను అదుపులోకి తీసుకుని 18మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దేవిక సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు

ఉదయగిరి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గండిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా పఖ్వాడ్‌లో భాగంగా మంగళవారం నిర్వహిం చిన పరిసరాల పరిశుభ్రత, చిత్రలేఖనం పోటీల విజేతలకు ఏపీజీబీ మేనేజర్ శోభన్‌బాబు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మనోజ్ఞ, షేక్ అఖీఫా, భవ్యశ్రీలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, అజయ్, చిన్నఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30మంది ఎంపిక

కందుకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 33మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల చివరి సంవత్సర విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు, నిరుద్యోగులు 61మంది పాల్గొనగా.. కంపెనీల హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మస్తానయ్య తెలిపారు.

హెల్మెట్ లేనివారే.. ప్రమాదాల్లో మరణిస్తున్నారు



ఆత్మకూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

కందుకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా కందుకూరు ఆర్డీవో టీవీఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం హెల్మెట్లు ధరించి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకుంటే కలిగే ప్రయోజనాలు వివరిస్తూ దూబగుంట సమీపంలోని ఆర్టీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో, పోస్టాఫీసు సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా టీవీఎస్ లక్ష్మి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 18-30ఏళ్ల మధ్య యువకులే ఉంటున్నారని.. వీరిలో అత్యధిక శాతం హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి వారే ఉన్నారని తెలిపారు. పరిమిత వేగంతో వెళ్తే మరణాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సీహెచ్ రాంబాబు, ఎన్ఫోర్స్‌మెంట్ ఎంవీఐ గోపినాయక్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ర్యాలీని మునిపల్ కమిషనర్ గంగాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ప్రధాన రహదారి వెంబడి మున్సిపల్ బస్టాండ్ వద్దకు సాగింది. అనంతరం పట్టణ సమీ పంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ జిలాని, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీవో లక్ష్మి

లే అవుట్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి..

● సీహెచ్ శ్రీదేవి, కావలి ఎంపీడీవో



కావలి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో లేఅవుట్లు వేసేవారు తప్పనిసరిగా పంచాయతీ, నుడా అనుమతి తీసుకోవాలని కావలి ఎంపీడీఓ సీహెచ్.శ్రీదేవి తెలిపారు. గత ప్రభుత్వంలో అక్రమ లే అవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని, ఇపుడు అలాంటి పరిస్థితి ఉండదన్నారు.

ఈ వారం ముఖాముఖి

? ఎన్ని అక్రమ లేఅవుట్లను గుర్తించారు.

! 17పంచాయతీల్లో 11పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించాం. నోటీసులు జారీ చేశారు. కొన్నిప్రాంతాల్లో లేఅవుట్లలో హద్దురాళ్లను తొలగించాం. సమస్యతో పంచాయతీలకు లక్షల ఆదాయంతో పాటు స్థలాలు కోల్పోతున్నారు.

? ప్రభుత్వ స్థలాలు ఉన్నట్లు ఫిర్యాదులు ఏమైనా వస్తున్నాయా.

! ఆముదాలదిన్నె, తుమ్మలపెంట లేఅవుట్లలో మతం భూమి, పోచమ్మదొరువు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదు వచ్చాయి. వాటిపైనే విచారణ చేసి నిజమని నిర్ధారణ చేసుకుని ఆక్రమణలు తొలగిస్తున్నాం.

మూడు నెలలుగా సీసీ రోడ్డు వివాదం

● రహదారి వేసేందుకు ప్రయత్నం

● అడ్డుకున్న స్థలం యజమానులు

ఉలవపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చాకిచర్ల పంచాయతీ సుబ్బరాయుడు సత్రం గ్రామంలో సిమెంట్ రోడ్డు వివాదం మూడు నెలలుగా కొనసాగుతోంది. మంగళవారం మరోమారు ఇదే రోడ్డు విషయమై స్థానిక అధికార పార్టీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో తెచ్చి మట్టి తవ్వేందుకు పోలీసుల బందోబస్తుతో వచ్చారు. ఈ స్థలంను తన తండ్రి 1985లోనే కొనుగోలు చేశాడని, ఇక్కడ సిమెంట్ రోడ్డు ఎలా వేస్తారని నారిశెట్టి మాల్యాద్రి కుటుంబ సభ్యులతో అడ్డుకున్నారు. ఈ సమయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలం లేకపోవడం విశేషం. స్థానిక అధికార పార్టీ నాయకుడు ప్రోద్బలంతో స్థానికులు కొందరు ఇలా చేస్తున్నారని స్థలం బాధితుడు మాల్యాద్రి ఆరోపించాడు. సొంత స్థలాల్లో రోడ్లు వేయిస్తారా అంటూ బాధిత కుటుంబ సభ్యులు ఎస్ఐ అంకమ్మను నిలదీయడంతో వారికి చెందిన స్థలం పట్టా పత్రాలను పరిశీలించి సర్వేయర్‌తో కొలతలు వేయిస్తానని సిబ్బందితో వెనుదిరిగారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు ఎంపీడీవో విజయ, తహల్దారు లావణ్యకు వినతిపత్రాలు అందజేశారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఏఈ జేవీ మూర్తి, చాకిచర్ల కార్యదర్శి వంశీలను వివరణ కోరగా పనులు చేపట్టేందుకు పోలీసు బందోబస్తు, ఎక్స్‌కవేటర్ తీసుకెళుతున్నట్లు సమాచారం ఇవ్వలేదని అధికారులు చెప్పడం విశేషం. ఇది పూర్తిగా వ్యక్తిగత, రాజకీయకక్షలో భాగంగా పోలీసులను వెంటేసుకొచ్చారని గ్రామస్థులు గుసగుసలాడుకోవడం విశేషం.



సంఘటన స్థలంలో ఉన్న పోలీసులు

నలందా విద్యార్థుల ప్రతిభ

కావలి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భారత సంస్కృతి ప్రతిష్ఠాన్ నిర్వాహకులు రామాయణ అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో గొల్లమూడివారి వీధిలోని నలందా హైస్కూల్ విద్యార్థులు పీవీ.రాఘవి, యశశ్విని, హేమసృజన్‌లు ప్రతిభ చూపారు. మంగళవారం పాఠశాలలో డైరెక్టర్ ఎండీ వసీంతో అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈవో గోవిందయ్య పాల్గొన్నారు. ప్రతిభా విద్యార్థులను మెమొంటోలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పాఠశాలలో రామాయణం, మహాభారతంలో ధర్మాన్ని బోధించడం వల్ల ఈ విజయం సాధ్యపడిందని ఎండీ వసీం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా వెంకట సుబ్బారావు



ఆర్యవైశ్య మండల నూతన కార్యవర్గం

లింగసముద్రం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండ నూతన అధ్యక్షుడిగా దేవకి వెంకట సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రాత్రి స్థానిక కోదండరాముని ఆలయంలో జరిగిన సమావేశంలో కందుకూరు ఆర్యవైశ్య నాయకులు, జిల్లా మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దేవకి శేషగిరిరావు, ఉపాధ్య క్షుడిగా వేముల మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శిగా దోరడ్ల కళ్యాణ చక్రవర్తి, కార్యదర్శిగా మలిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి గొల్ల శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గసభ్యులుగా దేవకి సుబ్బారావు, జల్లు హజరత్తయ్య, దేవకి లక్ష్మి, కొంజేటి వీరాంజనేయులు, కార్యవర్గసభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట కిషోర్‌బాబు, రమా శ్రీనివాసులు పాల్గొన్నారు.

రూ.26లక్షలతో రైతుబజారు అభివృద్ధి

● డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత

కావలి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రూ.26లక్షలతో పట్టణ రైతుబజార్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయసునీత తెలిపారు. మంగళవారం ఆమె రైతుబజార్‌ను పరిశీలించి ఇక్కడి పరిస్థితులపై అధికారులను ప్రశ్నించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ఇలాగేనా మండిపడ్డారు. వ్యాపారుల ఏర్పాటు చేసిన రేకులు పరిశీలించి వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిమూడో శనివారం విధిగా క్లీన్ అండ్ గ్రీన్ పాటిం చాలని ప్రభుత్వం చెబుతున్నా ఎందుకు నిర్లక్షం చేస్తున్నారని ఆగ్రహించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్ల అభివృ ద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని అందులో భాగంగా కావలి రైతుబజార్ అభివృద్ధి పనులకు ఈ నిధులు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాసరావు, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏడీ అనంతకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ మధు పాల్గొన్నారు.



రైతుబజార్‌ను పరిశీలిస్తున్న విజయ సునీత

ఎంపీడీవోకి సన్మానం



ఎమ్పీడీవోను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

ఉదయగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో విశిష్ట సేవలంది కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో అప్పాజీని స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షిస్తూ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కరీముల్లా, కార్యదర్శులు నాగూర్ వీరేంద్ర, జూనియర్ అసిస్టెంట్లు సమద్, రంగనాయకులు, డీఈవో ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సంగం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తరుణవాయిలో మంగళవారం తుంగా ఇందూధర్‌రెడ్డి జ్ఞాపకార్థం నారాయణ వైద్యశాల సౌజన్యంతో సర్పంచి శోభా బాలనాయుడు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తుంగా కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్లు గ్రామస్థులకు రక్తం, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నెల్లూరు కోటారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన

సీతారామపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ భార్గవి మంగళవారం పరిశీలించారు. తొట్టెల్లో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును పరిశీలించి మాట్లాడారు. ప్రజలు సామాజిక బాధ్యతగా ఇంటి నుంచి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవడం ద్వారా పంచాయతీ ఆదాయం సృష్టించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాంనాథరెడ్డి, జీవన్ కుమార్, అంబాసిడర్లు, పాల్గొన్నారు.

ఘనంగా కాశినాయన జయంతి

సీతారామపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):బెడుసుపల్లెలో మంగళవారం అవధూత కాశినాయనస్వామి జ్యోతిక్షేత్రంలో కాశినాయన జయంతిని వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. రాత్రి దివ్యజ్యోతి దర్శనం, కాశినాయన ఆలయం నుంచి రథోత్సవం, 108మంది మహిళలతో జ్యోతి కార్యక్రమం నిర్వహించారు.



వాహనాల దారి మళ్లింపు



వాహనాలను నిలిపేస్తున్న పోలీసులు

కావలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరికి వెళ్లే రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతులను నేషనల్ హైవే అధికారులు చేపట్టడంతో పోలీస్‌లు వన్‌వే ట్రాఫిక్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణ వాహన చోదకులతో పాటు ఉదయగిరి, పెద్దపవని మార్గాల నుంచి వచ్చే వాహనాలకు రైల్వే ఓవర్ బ్రిడ్జికి రెండు వైపులా కొంత సేపు ఆపి విదిలేయంతో ట్రాఫిక్ సమస్య మరింత రద్దీగా మారింది. మంగళవారం ట్రాఫిక్‌ను మార్చారు. జనతాపేట వైపు నుంచి వచ్చే వాహనాలను కొన్నింటిని దారి మళ్లిస్తున్నారు. బుడంగుంట గేటు మీదుగా చిన్న వాహనాలు, ఆటోలను అటు వైపు మళ్లిస్తూ ద్విచక్రవాహనాలను, పెద్ద వాహనాలను పెద్దపవనిరోడ్డులో అన్నపుగుంట వద్ద ఉన్న అండర్‌పాస్ మీదుగా మళ్లిస్తున్నారు. వంతెన మరమ్మతులను రాత్రిసమయంలో కూడా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈసీ సభ్యులకు శిక్షణ ప్రారంభం

సంగం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల ఈసీ సభ్యులకు మంగళవారం శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పొదుపు సంఘాల లావాదేవీలు, పుస్తక నిర్వహణ, జీవనోపాధికి శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కో ఏఈ మన్మథరావు పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమైఖ్య, ఈసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ శిక్షణ మూడురోజులపాటు జరగనున్నది.

ఎర్రచందనం దుంగల నరికివేతపై కేసు

కలిగిరి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుదూబగుంట సమీపంలోని అగ్రిగోల్డ్ భూముల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఎర్ర చందనం దుంగలను అక్రమంగా కొట్టివేయడంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. కొట్టిన వాటిలో కొన్నింటిని అక్కడే వదిలేసి వెళ్లారని కంపెనీ సూపర్‌వైజర్ నాగయ్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. సిబ్బందితో దుంగలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాడి రైతులకు చేయూత

సంగం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి చేయూతను అందిస్తున్నదని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ సుజని తెలిపారు. మంగళవారం మండలంలోని అన్నారెడ్డిపాళెంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులను పరీక్షించి సీజనల్‌గా వచ్చే వ్యాధులకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 90 శాతం రాయితీతో ప్రభుత్వం పాడి రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నదన్నారు. ఉపాధి నిధులతో పశుగ్రాసం పెంపకానికి ప్రోత్సాహకాలు అందచేస్తుందని తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలిన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత బండా హరికిషోర్‌రెడ్డి, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

● రామాపురంలో పశు వైద్యశిబిరం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): రామాపురం రైతు సేవా కేంద్రంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూగజీవాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్రబాబు, నక్కలగండి రిజర్వాయర్ చైర్మన్ వేమూరి మధుసూదన్, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారి సుజని

చీఫ్ సెక్రటరీని కలిసిన అరవ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్ర యాదవ్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లికి చెందిన నెల్లూరు పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ సెక్రటరీ అరవ రవీంద్రయాదవ్ మంగళవారం వెలగపూడిలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తొలిసారి యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కూటమి ప్రభుత్వం చీఫ్ సెక్రటరీగా నియమించడంపై సీఎం చంద్రబాబుకు దన్యవాదాలు తెలిపారు.

శనగరైతులు ఏడాదికోసారైనా పంట మార్పిడి చేయాలి

కందుకూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా శనగ సాగులో వస్తున్న వేరుకుళ్లు, మొదలుకుళ్లు తెగులు వస్తున్నాయని రైతులు విధిగా పంట మార్పిడి చేయాలని మండల వ్యవసాయాధికారి రాము సూచించారు. మంగళవారం ఓగూరులో పొలంపిలుస్తోందిలో శనగ పైరును పరిశీలించి మాట్లాడారు. శనగ సాగుకు కనీసం ఒక్క ఏడాదైనా విరామం ఇచ్చి జొన్న, సజ్జ, కొర్ర లాంటి పంటలు సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మోడల్‌మేకర్ మాధవ, గ్రామ వ్యవసాయ సహాయకులు శరత్‌కుమార్, పశువైద్య సహాయకుడు షేక్ షాజహాన్ పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఏడీఏ దేవసేనమ్మ

ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు: వరి పొలాల్లో ఎలుక నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉందని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ తెలిపారు. అప్పారావుపాళెం, బట్టేపాడులో పొలం పిలు స్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. వరిలో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ వాడాలన్నారు. మందును రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, వీఏఏలు ఏ రుబీస్‌రాణి, డీ అర్చన, రైతులు పాల్గొన్నారు.

● మర్రిపాడు: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. ఇర్లపాడులో పంటలను పరిశీలించారు. సచివాలయం వద్ద రైతులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: పబ్బులేటిపల్లిలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సాగులో ఉన్న వరిపైరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో సాంబశివయ్య, వీపీఏ స్వప్ననరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణ అడ్డగింపు

● సచివాలయాల్లో జంగం, వడ్డిపాలెం వాసుల ఫిర్యాదు



శ్మశాన స్థలంలో గట్లు వేసిన ఆక్రమణదారులు

బిట్రగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జంగంపాలెం, వడ్డిపాలెంలో తాతముత్తాలకాలం నుంచి ఉన్న శ్మశాన స్థలాన్ని స్థానికులు కొందరు మంగళవారం ఆక్రమణకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న రెండు గ్రామాల్లోని జంగం, వడ్డేర కులస్థులు అక్కడకు వచ్చి వారిని అడ్డుకున్నారు. ప్రజలు అక్కడకు వస్తున్నారి తెలిసి ఆక్రమణదారులు అక్కడినుంచి ఉడా యించారు. విషయంపై సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఆక్రమణదారుల నుంచి స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించండి

● మంత్రి నిమ్మలతో ఎంపీ వేమిరెడ్డి భేటీ

నెల్లూరు (హరనాథపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నీటిపారుదల సమస్యలను పరిష్కరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. మంగళవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయన మంత్రితో భేటీ అయ్యారు. జిల్లాలో పలు ఇరిగేషన్ సమస్యలు ఉన్నాయని చెప్పారు. కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ ప్రాధాన్యతను వివరించి రిజర్వాయర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కాలేయ వ్యాధితో బాధపడుతున్న వర్షిత్‌కు రూ.10లక్షల సీఎం సహాయనిధి చెక్కును వేమిరెడ్డి విజయవాడలోని తన నివాసంలో మంగళవారం అందజేశారు. ఇందుకూరుపేట మండలం నర్సాపురానికి చెందిన వర్షిత్ సమస్య జనసేన నాయకుల ద్వారా వీపీఆర్ దంపతులకు తెలియడంతో వారు స్పందించి సీఎంఆర్ఎఫ్ అందేలా చర్యలు తీసుకున్నారు.


మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మత్స్యకారుల సంక్షేమం మళ్లీ మొదలైంది

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ● సర్వేపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల

వెంకటాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పాలనలో మత్స్యకారుల సంక్షేమం మళ్లీ మొదలైందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తిక్కవరప్పాడు వద్ద సర్వేపల్లి రిజర్వాయర్‌లో మంగళవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మీనోత్సవంలో భాగంగా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద సర్వేపల్లి రిజర్వాయర్‌లోకి 5.62 లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. చేప పిల్లల కోసం 60 శాతం నిధులు ప్రభుత్వం సమకూరిస్తే 40 శాతం మత్స్యకార సొసైటీ భరిస్తుందన్నారు. అనికేపల్లి, తిక్కవరప్పాడు, సర్వేపల్లితోపాటు 11 గ్రామాలకు చెందిన 500 మంది ఎస్టీ, ఎస్సీ మత్స్యకారులకు చేపల వేట ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.


రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న సోమిరెడ్డి

ప్రజల కోసం పని చేయండి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడి ప్రజల కోసం పని చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. సర్వేపల్లి సచివాలయాన్ని, ఇస్కపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయ వ్యవస్థ వచ్చి ఐదేళ్లవుతుంటే 11 మంది ఉద్యోగులు ఉండి కూడా గిరిజనులకు కనీసం ఆధార్ కార్డు ఎందుకు ఇప్పించలేకపోయారని ప్రశ్నించారు. ఇకపై సచివాలయాల ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పీహెచ్‌సీలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇస్కపాళెం సచివాలయ భవనాన్ని పరిశీలించారు.

నిరుపయోగ వాహనాలను తరలించండి

● ట్రాఫిక్ పోలీసులకు ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ సూచన


మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): నగరంలో రోడ్లపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను గుర్తించి బయటి ప్రాంతాలకు తరలించాలని ట్రాఫిక్ పోలీసులకు నగర కమిషనర్ సూర్యతేజ సూచించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనేక చోట్ల నిరుపయోగమైన వాహనాలు రోడ్లపై ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గుర్తించారు. వీటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. మైపాడు రోడ్డు, జాఫర్‌సాహెబ్ కాలువ, సత్యనారాయణపురం, మైపాడుగేట్ కూడలిలో 200 షాపులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునేందుకు వీధి విక్రయ దారులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి బుధవారం నుంచి 31వ తేదీ వరకు కార్పొరేషన్ కార్యాలయంలో ఇంట ర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుం దన్నారు.

ఎంపీడీవోకి ఘన సన్మానం


ఎంపీడీవోని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

విడవలూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో నగేష్‌కుమారి సేవలు అభినందనీయమని టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కలెక్టరు చేతుల మీదుగా ఉత్తమ అధికారిణిగా ప్రశంసాపత్రాన్ని తీసుకున్న ఎంపీడీవో నగేష్‌కుమారిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అమలు పరచటంలో ఎంపీడీవో ఎంతగానో చొరవచూపారన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

● 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష'లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పేద, నిరుపేద కుటుంబాల్లోని రోగ బాధితులకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని 32, 33 డివిజన్లలో 'ఆరోగ్య రక్ష'లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగ బాధితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తించని వారికి దాతల సహాయంతో ఉచితంగా వైద్యం చేయిస్తామన్నారు. ఇక నుంచి రూరల్లో ఎక్కడికక్కడ స్థానిక నాయకులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దీనిని ఆయా ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆరోగ్యరక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

1న గణపతి సచ్చిదానంద స్వామి రాక

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మైసూరు దత్త పీఠాధిపతి, అవధూత గణపతి సచ్చిదానంద స్వామి, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి ఫిబ్రవరి 1న నెల్లూరులోని దత్త క్షేత్రానికి విచ్చేస్తారని గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలో పీఠాధిపతి పర్యటన కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పీఠాధిపతి, ఉత్తరాధికారి ఫిబ్రవరి 4వతేదీ వరకు నగరంలో ఉంటారని తెలిపారు. 2వతేదీ ఉదయం గోపూజ, శ్రీచక్రార్చన, లక్ష్మీనారాయణ హోమం జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు గణపతి సచ్చిదానంద స్వామి నాద ధ్యాన చికిత్స కచేరీ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పాసులు కావాల్సిన భక్తులు అష్టలక్ష్మీ ఆలయంలో సంప్రదించాలని కోరారు. 3వతేదీ వసంత పంచమి సందర్భంగా ఉదయం సరస్వతీపూజ, హోమం, నాగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు వితరణ చేస్తారన్నారు. సాయంత్రం 6గంటలకు దివ్యనామ స్మరణ జరుగుతుందని పేర్కొన్నారు. 4వతేదీ మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా ఉదయం 6గంటలకు సూర్యభగవానునికి విశేష పూజలు, సౌర హోమం జరుగుతాయని భక్తులందరూ తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు అనపల్లి మస్తాన్‌రెడ్డి, ఫణిరత్నం తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూటకో మాట : కాకాణి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూటకో మాట చెబుతున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు అబద్ధాల మీద అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర జీఎస్డీపీలో మూడు శాతం నుంచి 3.5 శాతం వరకు మాత్రమే అప్పులు తేవడానికి ఆస్కారం ఉంటుందని, కానీ చంద్రబాబు నాయుడు గిమ్మికులు చేసి ప్రజలను మోసం చేస్తూ ఆర్థిక పరిస్థితులపై అబద్ధాలు చెప్పి హామీలను ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

నేడు తై అమావాస్య

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్ వేమాలశెట్టి బావి వద్దనున్న వైద్య వీరరాఘవ స్వామి దేవస్థానంలో తై అమావాస్య వేడుకలు బుధవారం వైభవంగా జరుగుతాయని దేవస్థానం కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకారం, అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపింది. భక్తులందరూ తరలిరావాలని ఆలయ కమిటీ కోరింది.

పొట్లపూడిలో పశు వైద్య శిబిరం


టీపీ గూడూరు : పశు వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డీడీ డాక్టర్ శిలాని

తోటపల్లిగూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్లపూడిలో స్థానిక పశువైద్యాధికారి షఫీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విజయవాడ, నెల్లూరుకు చెందిన పశుసంవర్ధక శాఖ డీడీలు డాక్టర్ శిలాని, డాక్టర్ నాగమణి, ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎదకరాని పశువులకు చూడు నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు, లేగదూడలకు, పెద్ద పశువులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్లపూడికి చెందిన పాడి రైతులు నాసిన గిరీష్, సూరపాక రమేష్, వేటూరి విజయ్, పశువైద్య సిబ్బంది పెంచలయ్య, గోపాల్ మిత్ర యాసిన్, వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు : మండలంలోని గురివిందపూడిలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మడమనూరు, గురివిందపూడి పశువైద్యులు షరీఫ్, ఎస్‌కే. షంషాద్‌లు పశువులు, జీవాలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కొన్నింటికి శస్త్రచికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్‌శర్మ, మాతయ్య, అన్నారెడ్డి సుబ్బారెడ్డి, పశువైద్య సిబ్బంది శ్రీనువాసులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

● రాపూరు : పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పంగిలి, నల్లిపల్లె గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో పాడి పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. చూడి పరీక్షలు నిర్వహించారు. గొర్రెలకు షీప్ పాక్స్ టీకాలు వేశారు. పంగిలి క్యాంపులో రాపూరు ఏడీ డాక్టర్ అనీల్‌కుమార్, జేవీవో రమణయ్య, ఏహెచ్‌ఏ అఖిల్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. నల్లిపల్లెలో డాక్టర్ ఎస్.సుప్రజ, ఏహెచ్ఏఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్యమత ప్రచారాన్ని అడ్డుకున్న బీజేపీ నేత

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు దళితవాడలో మంగళవారం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు అన్యమత ప్రచారం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చేపట్టిన ఈ ప్రచారాన్ని ఓ యువతి సెల్‌ఫోన్లో వీడియో తీయ్యడంతో గమనించిన ఓ వ్యక్తి ఆమె నుంచి ఫోన్ లాక్కుని బెదిరించాడు. దీంతో స్థానిక మహిళలు వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ సమాచారాన్ని అందుకున్న బీజేపీ నేత కాసా శ్రీనివాసులు హుటాహుటిన అక్కడికి అన్యమత ప్రచారం చేస్తున్న వారిని అడ్డుకున్నారు. ఈ ప్రచారానికి ఎవరు అనుమతి ఇచ్చారని ఆ బృందం సభ్యులను నిలదీయడంతో వారిలో కొంతమంది పొరపాటైందని, ఇక వెళ్లిపోతామని ప్రాధేయపడ్డారు. దీంతో మందలించి పంపిచేశారు.


అన్యమత ప్రచార బృందంతో మాట్లాడుతున్న బీజేపీ నేత, అడ్డుకున్న స్థానికులు

చేనేతల కడుపు కొడుతున్నారు

● చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బాలాజీ

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పాటూరు, సంగం, కావలి, ములుముడి, సౌత్‌మోపూరు, వెంకటగిరితోపాటు అనంతపురం, గుంటూరు జిల్లాల్లో చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ రాష్ట్ర చేనేత జౌళిశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని చేనేత ఐక్య కార్యాచరణ కమిటి జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లోని చేనేత వస్త్రాలపై మోజు చూపిస్తూ అవినీతికి పాల్పడుతూ రాష్ట్రంలోని చేనేతల కడుపు కొడుతున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర, తెలంగాణ నుంచి వస్త్రాలను దిగుమతి చేసుకోవడం వెనుక అవినీతి జరిగిందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం నూలు, ముడి సరుకులు అందించకుండా చేనేత రంగాన్ని రాష్ట్ర చేనేత జౌళిశాఖ అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ-పంట నమోదు చేయించండి

మనుబోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లిలో వ్యవసాయాధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ-పంట నమోదు చేయించాలని వ్యవసాయాధికారి జహీర్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సాయిప్రతాప్, టీడీపీ నాయకుడు వై.మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరిపైరు పొలాల సందర్శన

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ఎ.రాజ్‌కుమార్, ఏవో డి.రఘునాథరెడిలు రైతులతో కలసి వరి పైరును సందర్శించారు. ఈ పంటలో నమోదు చేసుకున్న రైతు పంటలను మాత్రమే ప్రభుత్వం వారు మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు సుదిక్షణ, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు, సర్వేపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎన్ శ్రీనివాసులు, ఏవో హరికరుణాకర్‌రెడ్డి, వీఏఏలు సుప్రియ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్‌సీ మైదానంలో సింహపురి పుస్తక ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. పుస్తక ప్రదర్శన అంటే పలు ప్రాంతాల నుంచి వచ్చిన పుస్తక విక్రేతలు, ప్రచురణ సంస్థలు స్టాల్స్ భారీగా ఏర్పాటు చేస్తారని ఊహించిన సాహితీవేత్తలు, పుస్తక ప్రియులు నిరాశకు గురయ్యారు. పుస్తక ప్రదర్శన పేరుతో ఒకే స్టాల్ ఏర్పాటు చేశారు. దీనిని విశ్రాంత ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్, కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు జీ సుభద్రాదేవి, విశాలాంధ్ర సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, పలువురు సీనియర్ రచయితలు పాల్గొన్నారు. పుస్తక మహోత్సవానికి ఆరుద్ర సాహిత్య వేదిక అని నామకరణం చేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కే లక్ష్మయ్య పర్యవేక్షించారు.


సింహపురి పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం, సాహితీ వేత్తలు

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

● ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్

వెంకటాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ వీ శ్రీధర్ అన్నారు. వెంకటాచలం సమీపంలోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి గిడుగు వెంకటేశ్వరరావు, వెంకటాచలం సీఐ సుబ్బారావు, ఎంవీఐ పూర్ణచంద్రరావు, డాక్టర్ వెంకట తరుణ్, డాక్టర్ మేకల వంశీకృష్ణ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ షేక్ షమీమ్, జోనల్ వర్క్స్ మేనేజర్ ఇబ్రహీం, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్ఎస్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సీఐ సుబ్బారావుకు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

రికవరీ చేస్తేనే స్త్రీనిధి రుణాలు వస్తాయి

● ఏజీఎం కామాక్షయ్య

మనుబోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.14 లక్షలకుపైగా స్త్రీనిధి రుణాలు రికవరీ చేయాల్సి ఉందని, అవిచేస్తేనే మళ్లీ మహిళలకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తామని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య స్పష్టం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సంఘబంధాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు ఎందుకు రికవరీ చేయడం లేదని వీవోఏలను ప్రశ్నించారు. రూ.లక్షల్లో డబ్బులు తినేసి రికవరీ చేయకపోవడంతో ఏడాదిగా మనుబోలు మండలానికి స్త్రీనిధి రుణాలు ఇవ్వడం లేదన్నారు. వీరంపల్లి, కొమ్మలపూడి గ్రామాల్లో దాదాపు రూ.14లక్షలు ఆగిఉందన్నారు. కనీసం ఫిబ్రవరి నాటికి రూ. 4లక్షలు అయినా చెల్లించాలన్నారు. డబ్బులు తినేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ శ్రీధర్, ఏసీ మధుసూదన్, సంఘమిత్ర కార్యదర్శి శ్రావణి, కోశాధికారి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిధుల దుర్వినియోగంపై వీవోఏలను ప్రశ్నిస్తున్న స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య

డెంగ్యూ అనుమానిత ప్రాంతాల్లో సర్వే : వైద్యాధికారి

నెల్లూరు (వైద్యం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అనుమానిత ప్రాంతాల్లో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు చేపడుతున్నామని అదనపు జిల్లా మలేరియా అధికారి నాగార్జునరావు వెల్లడించారు. మంగళవారం నెల్లూరులోని వేదాయపాళెం పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధిలోని రోశిరెడ్డి కాలనీలో అనుమానిత డెంగ్యూ ప్రబలిన ప్రాంతాల్లో లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను మలేరియా విభాగం చేపట్టింది. ఈ సందర్భంగా నాగార్జునరావు మాట్లాడుతూ నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. రాత్రి పూట నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలన్నారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు మస్కిటో స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అనుమానిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

న్యూస్ బాక్స్

అవార్డు గ్రహీతలకు అభినందన

వెంకటాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సమాజానికి విశేష సేవలను అందిస్తూ విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశేషమైన సేవలు అందించిన వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్‌కి చెందిన 5 మంది ప్రోగ్రామ్ అధికారులు జిల్లా స్థాయి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. దీంతో వారిని మండలంలోని వీఎస్‌యూలో మంగళవారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులున్నారు.

రీసర్వేలో తప్పులు జరిగితే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఐవో నరసింహమూర్తి

విడవలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో తప్పులు జరిగితే చర్యలు తప్పవని డీఈఐవో నరసింహమూర్తి హెచ్చరించారు. అన్నారెడ్డిపాళెంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన డీఈఐవో మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ, సచివాలయ సర్వేయర్లు రీసర్వేలో పాటించాల్సిన నిబంధలను వివరించారు. రీసర్వేలో పొరపాట్లు జరిగితే అందుకు మీరే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఆర్ఐ అబ్దుల్ సలాం, ఎంపీటీసీ కుడుముల మోహన్ , వీఆర్వోలు పాల్గొన్నారు.

యాచక మహిళలు హోంకు తరలింపు

నెల్లూరు (హరనాథపురం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలుచోట్ల భిక్షాటన చేస్తున్న మహిళలను, పిల్లలను మంగళవారం అధికారులు పట్టుకున్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు, అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. యాచన చేస్తున్న పిల్లలు, మహిళలను హోంకు తరలించారు. 8 మంది పిల్లలతో ఉన్న మహిళలకు చట్టాలు, శిక్షలను వివరించారు. పిల్లలతో యాచన చేయిస్తే జేజే యాక్టు 2015 సెక్షన్ 76 కింద రూ.లక్ష జరిమానా, 2 సంవత్సరాల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది రాంబాబు, సతీష్, డీసీపీయూ సిబ్బంది సోమలత, సుజాత, పావని, జ్యోతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి.. దంపతులకు గాయాలు

పొదలకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కత్తితో దాడి చేసి ఇద్దరిని గాయపరిచిన ఘటన పొదలకూరులో మంగళవారం జరిగింది. ఎస్ఐ మహ్మద్‌హనీఫ్ కథనం మేరకు.. పొదలకూరు పంచాయతీ పరిధిలోని తోకంచి గిరిజన కాలనీకి చెందిన ఉడుముల రాము, కొల్లూరు రాజు మధ్య చిన్నపాటి విషయంలో వివాదం చెలరేగింది. వివాదం ముదరడంతో ఉడుముల రాము, అతని భార్య లక్ష్మమ్మపై కొల్లూరు రాజు కత్తితో దాడికి పాల్పడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ హనీఫ్ వైద్యశాలకు వెళ్లి దాడి జరిగిన తీరును అడిగి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు గాంధీ వర్ధంతి

ఇందుకూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమం రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జేసీ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యువత ఉద్యోగాలకు ఎంపిక

నెల్లూరు(విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంఫార్మసీ పూర్తి చేసిన యువత పాల్గొనగా పలు సంస్థలు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 21 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, ప్లేస్‌మెంట్ అధికారి జనార్దన్, స్కిల్‌హబ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీరంజని పాల్గొన్నారు.

శ్మశానాలకు ప్రహరీలు

● మున్సిపల్ కమిషనర్ మౌర్య

జీవకోనలో పారిశుధ్య నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్న నేపథ్యంలో 150 మంది అదనపు సిబ్బంది నియమిస్తామని మున్సిపల్ కమిషనర్ మౌర్య ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరతను అధిగమించడానికి ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. దీన్ని పదిహేను రోజుల్లో అమలు చేస్తామన్నారు. శ్మశాన వాటికలకు ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరగా టెండర్లు పిలుస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా జీవకోనతో సహా నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. అలాగే ఇక్కడ రోడ్లపై గోతులు పూడ్చడంపై దృష్టి పెడతామన్నారు. జీవకోన ప్రాంతంలోని ప్రతి వార్డులోనూ స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుంటామని, వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం కాలువల్లో ఎవరూ ప్రమాదవశాత్తూ పడిపోకుండా కాలువలపై ఇనుప గ్రిల్ అమర్చుతామని, ఆ కాలువల్లో సిమెంట్ లైనింగ్ తొలగించే విషయమై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తామన్నారు. పట్టా, అనుభవ పత్రం, స్థలం వున్న వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.



జీవకోనలో ప్రతిధ్వనించిన ప్రజాగళం

పోలీసు ఔట్ పోస్టు

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

అసాంఘిక శక్తుల సంచారాన్ని, మత్తు పదార్థాల వినియోగంపై తక్షణం ఉక్కుపాదం మోపుతామని అందులో భాగంగా జీవకోనలో పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయిస్తామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రకటించారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు నిర్దిష్టమైన హామీ ఇచ్చారు. అలాగే జీవకోన ప్రాంతంలో ప్రజలకు శుద్ధి చేసిన జలాలను అందించడానికి తన కుటుంబానికి చెందిన జేఎంసీ ట్రస్టు ద్వారా రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రెండు నెలల్లో వీటిని పూర్తి చేసి ఉచితంగా తాగునీరు అందిస్తామన్నారు. పదిహేను రోజుల్లో జీవకోనలో అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. జీవకోనలో భూములు అటవీ శాఖ, కాలువ పోరంబోకు కేటగిరీలో వున్నందున స్థానికులు కట్టుకున్న ఇళ్ళకు పట్టాలు మంజూరు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అటవీ శాఖ అనుమతుల కోసం ప్రయత్నిస్తామని, సాధ్యం కాకుంటే అనుభవ పత్రాలు ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. జీవకోనలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామన్నారు. రామాపురం రిజర్వాయర్ నుంచీ పైపులైన్ల ద్వారా జీవకోనలో నీరులేని ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. తిరుపతి, తిరుమలలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఆదేశించారని గుర్తు చేసిన ఎమ్మెల్యే, టీటీడీ నుంచీ రూ. 45 కోట్లు నిధులు తెప్పించి రిజర్వాయర్ నిర్మాణానికి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కపిలతీర్థం నీటిని నిల్వ చేసేందుకు రూ. వంద కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించే ప్రతిపాదనపై టీటీడీ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారని, దానికోసం ప్రయత్నిస్తామన్నారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం మిగులు నీటిని వినాయక సాగర్‌కు మళ్ళిస్తామని, మురికి నీరు వినాయక సాగర్‌లో కలవకుండా చూస్తామన్నారు. జీవకోనలో యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇప్పించి ప్రైవేటు ఉద్యోగాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీవకోనలో మురికి నీటి కాలువను ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తామని, సత్యనారాయణపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

● మౌళిక వసతుల కొరత మొదలు, సామాజిక సమస్యల దాకా ప్రస్తావించిన ప్రజలు ● భారీగా హాజరైన స్థానికులు ● పెద్ద సంఖ్యలో మహిళలు
● పలు అంశాలపై విస్పష్ట హామీలిచ్చిన ఎమ్మెల్యే, కమిషనర్ ● విజయవంతంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' సదస్సు

ఆంధ్రజ్యోతి అండగా.. తిరుపతి నగరంలోని జీవకోన ప్రజలు తమ సమస్యలపై గొంతు విప్పారు. మంగళవారం ఉదయం జీవకోనలోని అంబేడ్కర్ సర్కిల్‌లో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' నినాదంతో మంగళవారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన సదస్సులో మౌళిక వసతుల కొరత నుంచీ శాశ్వత సమస్యల దాకా ప్రజాగళం ప్రతిధ్వనించింది. భారీగా హాజరైన స్థానికులు, ప్రత్యేకంగా తరలివచ్చిన మహిళలు నిత్యం తామెదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టారు. రెండు గంటల పాటు జరిగిన సదస్సులో బాధిత జనం వెతలు విన్న ముఖ్య అతిథులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య వాటిలో పలు సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన హామీలిచ్చారు. సదస్సుకు హాజరైన కార్పొరేషన్, రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకూ, అధికార యంత్రాంగానికీ, ప్రజాప్రతినిధులకూ వారధిగా ఆంధ్రజ్యోతి చేసిన ఈ ప్రయత్నాన్ని అతిథులు అభినందించగా, సదస్సుకు హాజరైన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జీవకోన జనం చెప్పిన సమస్యలు

● జీవకోన ప్రాంతం శేషాచల పర్వత పాద భాగంలో వుండడం వల్ల నగరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే మిట్ట ప్రదేశం. దీంతో ఎత్తు ప్రాంతానికి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. శాశ్వత పరిష్కారంగా జీఎస్ఎల్ఆర్ నిర్మాణం చేపట్టాలి. తాత్కాలికంగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేపట్టాలి.

● తిరుమల గిరుల్లో కురిసే వర్షపు నీరు మాల్వాడిగుండం చేరి అక్కడి నుంచీ జీవకోన మీదుగానే దిగువకు వృధాగా వెళుతున్నాయి. ఆ కాలువకు సిమెంట్ లైనింగ్ వేయడంతో నీరు భూమిలోకి ఇంకడం లేదు. సిమెంట్ లైనింగ్ తొలగిస్తే నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు రీఛార్జి అవుతాయి. ఎగువన చెక్‌డ్యాం నిర్మించి నీటిని నిల్వ చేసుకోవచ్చు. ● కాలువలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదవశాత్తూ కాలువల్లో పడిపోయి ఇప్పటి వరకూ ఐదుగురు మరణించారు. ఎత్తైన గోడలు నిర్మించాలి.

● సత్యనారాయణపురం, అమెరికన్ బార్ కూడళ్ళలో రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఫుట్ పాత్‌ల ఆక్రమణలు తొలగించి రోడ్లు విస్తరించడంతో పాటు కీలక సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు సిబ్బందిని నియమించాలి.

● జీవకోనలో ప్రధాన వీధుల్లో మురికి నీటి కాలువలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా తిరుమల కొండల నుంచీ నీరు వచ్చి ఇళ్ళలోకి చేరుతున్నాయి. దీన్ని నివారించేందుకు మురికి నీటి కాలువలు నిర్మించాలి.

● జీవకోనలో అనేక వీధుల్లో రోడ్లు పాడైపోయి ఉన్నాయి. వీటిని నిర్మించాలి.

● పక్కపక్కనే వేర్వేరుగా వున్న మూడు మతాలకు చెందిన స్మశానాలకు ప్రహరీలు లేవు. గేట్లు లేవు. దీంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు వేదికలవుతున్నాయి. కొందరు యువకులు గంజాయి, డ్రగ్స్ మద్యం సేవించి ఈ ప్రాంతాల్లో ప్రమాదకరంగా సంచరిస్తున్నారు. నిరోధించేందుకు పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలి.

● జీవకోనలో యువతకు తగిన జీవనోపాధి లేకపోవడంతో కొందరు జులాయిగా తిరుగుతూ గంజాయి సేవనానికి అలవాటు పడుతున్నారు. యువతకు ఉపాధి కల్పించడంతో పాటు డ్రగ్స్, గంజాయి రవాణా, వినియోగాలపై ఉక్కుపాదం మోపాలి.

● జీవకోనలో కుక్కల బెడద ఎక్కువైంది. నిర్మూలనపై దృష్టి పెట్టాలి.

● పలు ప్రాంతాల్లో మురికి కాలువలను రోజుల తరబడీ శుభ్రం చేయడం లేదు. దోమలు ప్రబలుతున్నాయి. రోగాలు పెరుగుతున్నాయి.

● జీవకోనలో ప్రధానంగా నివసిస్తున్నది పేదలు, కూలీలు, చిరు వ్యాపారులు. సెంటు కంటే తక్కువ స్థలంలో ఇళ్ళు కట్టుకుని ఉంటున్నారు. చాలామందికి పట్టాలు లేవు. అలాగే సొంత స్థలాలు, ఇళ్ళు లేని వారూ ఎక్కువే. ఇళ్ళు వున్న వారికి పట్టాలు లేదా అనుభవ పత్రాలు ఇవ్వాలి. ఇళ్ళు లేని వారికి పక్కా ఇళ్ళు, స్థలాలు లేని వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలి.

తిరుపతి నగరం జీవకోనలో మంగళవారం ఉదయం 10.30కి ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' సదస్సు ప్రారంభం అయ్యింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మౌర్య ముందుగా ఆ ప్రాంతంలోని వీధుల్లో తిరుగుతూ కాలువలు, రోడ్ల స్థితిని స్వయంగా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ నీటి సరఫరా, పారిశుధ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. విశిష్ట అతిథి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడలిలోని అండేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అతిథులుగా 48, 49 డివిజన్‌ల కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పి.కుమారమ్మ పాల్గొన్నారు. వీరు జీవకోన విశిష్టతను వివరిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా ఎమ్మెల్యేని, కమిషనర్‌ను కోరారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామసుందర్, డిసిపి మహాపాత్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజనీర్ గోమతి, ఆర్‌వోలు సేతుమాధవ్, రవి, డీఈ రమణ, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి హాజరయ్యారు.

తిరుపతి నగరంలోనే అత్యంత విశాలమైన కాలనీగా ఉన్న జీవకోనలోని రోడ్లు వాన కురిస్తే మడుగుల్లా మారుతున్నాయని, తిరుమల కొండలమీద కురిసిన నీళ్లంతా జీవకోన మీదుగానే కిందికి పారుతున్నా, తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని, కాలువల్లో మురికి పేరుకుపోయి దోమల ఆవాసాలుగా మారుతున్నాయని జీవకోన వాసుల్లో ఎక్కువ మంది ప్రధానంగా సదస్సుల్లో తెలియజేశారు. 35 ఏళ్లుగా నివాసం ఉంటున్నా శాశ్వత ఇళ్లపట్టాలు లేవని, డీకేటీలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై స్పందించిన కమిషనర్ ఎన్.మౌర్య అక్కడి కక్కడే కొన్ని సమస్యలపై నిర్ణయాలు ప్రకటించారు. జీవకోన అభివృద్ధికి తాము చేస్తున్న ప్రయత్నాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వివరించారు. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన అర్జీలను సదస్సుత తర్వాత కూడా ఎమ్మెల్యే ఓపికగా స్వీకరించారు. వారి సమస్యలను విని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జీవకోనలో చాలా మంది చదువుకున్నా పనులు లేక వ్యసనాలకు బానిసలైపోతున్నారంటూ ఒక తల్లి వ్యక్తం చేసిన ఆవేదన అందరినీ కదిలించింది. గంజాయి బ్యాచ్‌లతో రాత్రిళ్లు భద్రత లేకుండా పోతోందన్న మహిళల మాటలకు స్పందించిన ఎమ్మెల్యే అక్కడ పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 300 మందికి పైగా జీవకోన ప్రజలు హాజరైన సదస్సు పరిష్కార దిశగా విజయవంతంగా ముగిసింది. సదస్సులో ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ఆంధ్రజ్యోతి ప్రజల వెంట ఉంటుందని,అధికారులకు, ప్రజాప్రతినిధులకు గుర్తు చూస్తూనే ఉంటుందని ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి ముఖ్య అతిథులను వేదికమీదకు ఆహ్వానించగా, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు సదస్సు ఉద్దేశ్యాన్ని వివరిం చి, సభను నిర్వహించారు. ఆంధ్రజ్యోతి తిరుపతి ఎడిషన్ ఇన్‌చార్జి సుధాకరబాబు, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, ఏడీవీటీ మేనేజరు ఈశ్వరనాయుడు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజరు ఉమాపతి, ఆంధ్రజ్యోతి సిబ్బంది సదస్సు నిర్వహణను పర్యవేక్షించారు. ఆంధ్రజ్యోతి తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ నరేంద్ర సదస్సును విజయవంతం చేసిన అతిథులకు, హాజరైన జీవకోన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సదస్సులో జనసేన పార్టీ నేతలు రాజారెడ్డి, బాబ్జీ, వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచారి, టీఎన్‌టీయూసీ నేత లక్ష్మీపతి నాయుడు, టీడీపీ నేత గోళ్ళ లోకేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

4లో ప్రజా స్వరం



నేటి సుప్రభాత వేళ..

షార్‌లో శత ప్రయోగ సందడి


ప్రయోగ వేదికపై రాకెట్

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): షార్‌లో బుధవారం సూర్యోదయ వేళ ఇస్రో వందో రాకెట్ ప్రయోగం జరపనుంది. ఉదయం 6.23 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. ఈ రాకెట్ ద్వారా నావిగేషన్ సేవలకు సంబంధించిన నావిక్-02 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు. షార్ నుంచి సెంచరీ ప్రయోగం కావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఇటు శాస్త్రవేత్తలు, ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు షార్ చేరుకొని ప్రయోగ ఏర్పాట్లో నిగమ్నమై ఉన్నారు. ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు ప్రారంభమై నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఈ ఏడాది షార్ నుంచి ఇది తొలి ప్రయోగం.

ప్రయోగం @ 19.17 నిమిషాలు

151 సెకన్లకు మొదటి.. 294 సెకన్లకు రెండో దశ.. 1,140 సెకన్లకు కీలకమైన మూడోదైన క్రయోజనిక్ దశకు రాకెట్ చేరుకుంటుంది. ఆ తర్వాత రాకెట్‌లోని నావిక్-02 ఉపగ్రహాన్ని 170 కిలోమీటర్ల దూరంలో భూమికి దగ్గరగా (పెరిజి) 36,577 కిలో మీటర్ల దూరంగా (అపోజి) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెడతారు. ప్రయోగం మొత్తం 19.17 నిమిషాలకు పూర్తయ్యేలా శాస్త్రవేత్తలు రాకెట్‌ను డిజైన్ చేశారు.



చెంగాళమ్మకు మొక్కులు

జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ విజయవంతం కావాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మంగళవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయంలో పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇస్రో చైర్మన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, షార్ అధికారులు గోపి కృష్ణ తదితరులు ఉన్నారు.





యువతకు ఉపాధి కల్పించండి

స్థానికంగా ఉన్న యువతకు ఉద్యోగాలు, పనులు లేక గంజాయి, మద్యం వంటి అలవాట్లకు బానిసలవుతున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పెళ్లిళ్లు కూడా జరగడం లేదు. ఇలాంటి వారికి చిన్నపాటి ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారి జీవితాలతోపాటు వారి కుటుంబాలను ఆదుకున్న వారవుతారు.

- జి.మల్లిక

ఇవీ జీవకోన సమస్యలు!



- ఆంధ్రజ్యోతి సదస్సులో వినిపించిన ప్రజాస్వరం
- కమిషనర్, ఎమ్మెల్యేలకు స్థానిక ప్రజల వినతులు

తిరుపతి (వైద్యం, మంగళం), ఆంధ్రజ్యోతి

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' అంటూ ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ పిలుపునందుకుని పెద్ద సంఖ్యలో జీవకోన ప్రజలు మంగళవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సదస్సుకు హాజరయ్యారు. తిరుపతి కమిషనర్, ఎమ్మెల్యేలకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పరిష్కరించాల్సిందిగా కోరారు. వీరి సమస్యలను సావధానంగా విని, నోట్ చేసుకున్న కమిషనర్ ఎన్. మౌర్య వెంటనే పరిష్కరించగలిగిన మౌలిక సమస్యల గురించి అక్కడే మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దశాబాలుగా ఎదుర్కొంటున్న శాశ్వత సమస్యలపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పందించారు. పరిష్కారానికి హామీలిచ్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి అందజేశారు. సదస్సులో జీవకోన వాసులు నివేదించిన సమస్యలు ఇవీ...

శాశ్వత పట్టాలు ఇవ్వండి



జీవకోనలో నివసిస్తున్న వారందరికీ డీకేటీ ఇంటి పట్టాలే ఉన్నాయి. వీటికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఇప్పడైనా శాశ్వత పట్టాలు ఇప్పిస్తే ఈ ప్రాంతవాసులకు భద్రత ఉంటుంది.

- సీ.సుబ్రహ్మణ్యం, స్థానికుడు

గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా శ్మశానం



హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల సమాధులు ఎక్కడా లేని విధంగా జీవకోనలోని ఒకే చోట ఉన్నాయి. అయితే గంజాయి బ్యాచ్‌కి అడ్డాగా మార్చేశారు. శ్మశానాలకు కాంపౌండ్ నిర్మించి, గేట్లు ఏర్పాటు చేసి భద్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

- మహ్మద్ రఫీ, జీవకోన

మూడేళ్లుగా తాగునీటి సమస్య



అన్నమయ్యనగర్, రాఘవేంద్ర నగర్ ప్రాంతాల్లో మూడేళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్నాం. క్రమం తప్పకుండా నీటి పన్నులు కట్టించుకుంటున్నారు కానీ నీటిని మాత్రం సక్రమంగా సరఫరా చేయడం లేదు.

- ఎం.శకుంతల, అన్నమయ్యనగర్

కపిలతీర్థానికి రోడ్డు వేయండి



జీవకోన నుంచి కపిల తీర్థంకు వెళ్లాలంటే సత్యనారాయణపురం మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జీవకోన నుంచి ఫారెస్టు భూముల మీదుగా రోడ్డు ఏర్పాటు చేస్తే రెండు నిముషాల్లో కపిలతీర్థంకు చేరుకునే అవకాశం ఉంటుంది.

- ధర్మయ్య, ఉపసర్పంచి

చెక్‌డ్యాం కట్టండి

వానలకు తిరుమల కొండల్లోంచి వచ్చే నీటిని నిల్వ చేసేలా చెక్‌డ్యాం నిర్మిస్తే జీవకోన ప్రాంతంలో ఎటువంటి నీటి సమస్య ఉండదు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయండి.

- శ్రీనివాసయాదవ్, క్రాంతినగర్



వానపడితే రోడ్లు గుంతలవుతున్నాయి



చిన్నపాటి చినుకులు పడినా గోవిందనగర్‌లోని రోడ్లు మడుగులను తలపించేలా మారుతు న్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయంపై అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదు.

- శ్రీదేవి, గోవిందనగర్

మూడు నెలలుగా బర్త్ సర్టిఫికెట్ కోసం..



బర్త్ సర్టిఫికెట్ కోసం మూడు నెలలుగా మీసేవా, మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఎవరూ పట్టించుకోవం లేదు. ఆన్‌లైన్‌లో దేనికి నమోదు చేసుకోవాలన్నా బర్త్ సర్టిఫికెట్ అడుగుతున్నారు.

- బి.లక్ష్మి, రాఘవేంద్రనగర్

కాలువలు శుభ్రం చేయండి



వారాల తరబడి మురికి కాలువలు శుభ్రం చేయడం లేదు. దీంతో చెత్తాచెదారం చేరి దుర్వాసనతోపాటు దోమల సమస్య పెరుగుతోంది. రోగాల బారిన పడాల్సి వస్తోంది. వారానికి రెండు సార్లు కాలువలను శుభ్రం చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.


- షాబీరా, క్రాంతినగర్

పిట్టగోడలు నిర్మించండి

భారీ కాలువలకు కనీసం పిట్టగోడలు కూడా లేకపోవడం వలన అనేక మంది ప్రమాదవశాత్తు వాటిల్లో పడి మృతిచెందుతున్నారు. ఇటీవల ఐదు మందికి పైగా ఆ కాలువల్లో పడి మరణించారు. కొంత ఎత్తుగా పిట్ట గోడను నిర్మిస్తే మంచిది.

- రామనాథం, శ్రీరామ్‌నగర్





30 ఏళ్లుగా డీకేటీ లేనా?



నివాస స్థలాలకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నాం 30 ఏళ్లకు పైగా నివసిస్తున్న అనేక మందికి ఇప్పటికీ ఇళ్ల పట్టాలు లేవు. కేవలం డీకేటీ పట్టాలతోనే కాలం గడుస్తోంది. అవసరానికి లోన్లు తీసుకునే వీలులేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం శాశ్వత పట్టాలను ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

- శ్రీరాములు, 48వ డివిజన్

గోవిందనగర్‌లో రోడ్లు అధ్వానం



గోవిందనగర్‌లో ఐదేళ్లుగా రోడ్ల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. గుంతలతో నిండిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది.

- లక్ష్మి, గోవిందనగర్

పాతికేళ్ల కిందటి డ్రైనేజీ వ్యవస్థ

జీవకోనలో పాతికేళ్ల కిందటి డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిలో నాలుగైదు డ్రైన్స్ నిరుపయోగంగా ఉన్నాయి. ఎత్తు, పల్లాలు ఉండడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రత్యేకించి లెప్రసీకాలనీలో సమస్యలను పరిష్కరించాలి. ఈ ప్రాంతంలో ఎక్కువగా పేదలు, కూలీలు నివశిస్తున్నారు. సొంతస్థలం ఉన్నవారికి పీఎంఏవై పథకం కింద ఇళ్లను మంజూరు చేయాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద పేదలందరికీ ఇంటిస్థలంతోపాటు ఇళ్లు మంజూరు చేయాలి. ఈప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే సహాయ, సహకారాలు అందించాలి.



- అన్నా సంధ్య, 49వ డివిజన్ కార్పొరేటర్

టెక్నికల్ టీమ్‌తో అధ్యయనం చేయాలి



నీటి సమస్య ఎక్కువగా ఉంది. తిరుమలనుంచి ఈ ప్రాంతానికి నీళ్లు వస్తున్నా సమస్య తీరడంలేదు. ఇక్కడ తెగిపోయిన కోన ఉండేదని, నది ప్రవహించేదని మాపెద్దలు చెప్పేవారు. దీనిని పునరుద్ధరించాలి.ఇది తిరుపతికి ఇంకు డుగుంతగా ఉంటుంది. మున్సిపల్ టెక్నికల్ టీమ్‌తో అధ్యయనం చేసి నీటి సమస్యను పరిష్కరించాలి. సత్యనారాయణపురం వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కానిస్టేబుల్‌ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అలాగే పోలీస్ అవుట్‌పోస్ట్‌ని ఏర్పాటు చేయాలి. ఓపెన్ డ్రైన్స్ ఉండడం వల్ల చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. జరిమానాలు విధించడం.. ప్రజలను చైతన్యవంతులను చేయడం వల్ల కొంతవరకు నియంత్రించొచ్చు. దీంతో నగర బ్యూటిఫికేషన్‌కి అవకాశం ఏర్పడుతుంది.

- అన్నా అనిత, 48వ డివిజన్ కార్పొరేటర్

గంజాయి, డ్రగ్స్‌ని నియంత్రించాలి



ఇక్కడి వాటర్‌హెడ్ ట్యాంక్, శ్మశానవాటిక గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారికి అడ్డాగా మారాయి. అటువైపు మహిళలు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించాలి. పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి. ఇక్కడ నిరుపేదలు ఉంటున్నారు. ఇద్దరేసి కలిసి వాటాలు వేసుకుని 10-15 అంకణాలు కొని, స్థలాన్ని రెండుగా చేసుకుని చిన్నపాటి ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఒకేపన్ను రశీదు ఇస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. రాజీవ్‌గాంధీ కాలనీలోని ఏడున్నర అంకణానికి పన్ను రశీదు మార్చకపోవడంతో ఇళ్లు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చూపుతున్న చొరవ అభినందనీయం.

- పి.కుమారమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

వడమాలపేటలో స్థలం ఎందుకు?



ఇక్కడ ఉండే మాకు గతంలో ఎక్కడో వడమాలపేటలో ఒక సెంటు స్థలాన్ని ఇచ్చారు. కానీ ఆ స్థలానికి సరైన హద్దులు కూడా చూపలేదు. దానిని రద్దు చేసి మాకు అనువుగా సమీపంలో కనీసం రెండు సెంట్ల స్థలాన్ని ఇప్పించాలని కోరుతున్నాను.

-పార్వతి, సత్యనారాయణపురం

జేఎల్‌నగర్‌లో ఆకతాయిలు



జేఎల్‌నగర్‌లోని గుడి, బడి ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు విచ్చలవిడిగా గంజాయి తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇక్కడ ఎక్కువగా వికలాంగులు, లెప్రసీ బాధితులు ఉన్నారు. వీరికి సరైన మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాలని కోరుతున్నా.

- చిరంజీవి, జేఎల్‌నగర్

కుక్కల బెడద



జీవకోనలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. బయట ఆడుకునే చిన్నపిల్లల మీద కూడా కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. అలాగే రాత్రిళ్లు కొందరు ఆకతాయిలు మద్యం తాగి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ అల్లరి చేస్తున్నారు.

- శ్యామల, జీవకోన

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించండి



సత్యనారాయణపురం సర్కిల్ నుంచి అమెరికన్ బార్ వరకు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పది అడుగుల మేర ఆక్రమణకు గురై ఉంది. 40 అడుగుల రోడ్డు 20 అడుగులకే పరిమితమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. స్కూళ్ల వాహనాలు వచ్చి వెళ్లే సమయాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంది.

- సుబ్రహ్మణ్యం నాయుడు, జీవకోన

కాలువల్లో కాంక్రీట్ తొలగించండి



తిరుమల కొండల్లోంచి వచ్చే వాననీరు మాల్వాడిగుండం మీదుగా జీవకోనకు చేరుతాయి. ఈ కాలువల్లో కాంక్రీట్ ఫ్లోర్ ఏర్పాటు చేయడం వలన భూమిలో ఇంకడంలేదు. దీనివల్ల భూగర్భజలాలు పెరగవు. కాలువల్లో సిమెంటు ఫ్లోరింగ్ తొలగించడం అవసరం.

- ప్రకాష్, జీవకోన

కాలువలు శుభ్రం చేయండి



కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వలన దోమలు ఉత్పన్నమవుతున్నాయి. వారంలో ఒకసారైనా కాలువలను శుభ్రం చేయిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

- జయచంద్రనాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపల్, జీవకోన

పొలాల్లో గొలుసు దొంగల హల్‌చల్

తిరుచానూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోనే కాదు పల్లెలకూ చైన్ స్నాచింగ్ పాకుతోంది. జిల్లాలో ఒక్క మంగళవారమే రెండు చోట్ల ఈ తరహా చోరీలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం కస్తూరికండ్రిగకు చెందిన చిన్ని ఉదయం పొలంలో ఆవు పాలు పితుకుతున్నారు. అదే సమయంలో మంకీక్యాంపు ధరించిన ఇద్దరు వచ్చి మెడలోని 50 గ్రాముల బంగారు గొలుసు, పుస్తెలు లాక్కెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్‌చౌదరి తెలిపారు. పుత్తూరు అర్బన్ పరిధిలోని వీరపురెడ్డిపాళెం వద్ద వృద్ధ దంపతులు పొలం వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. మంకీ క్యాప్ ధరించిన వ్యక్తులు ఆ మహిళా రైతు వద్దకు వచ్చి నీరు అడిగారు. నీరు ఇచ్చే సమయంలో ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో గొలుసులో కొంతభాగం ఆమె చేతికి చిక్కింది. మిగిలిన భాగాన్ని దొంగలు తీసుకుపోయారని పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

రసకందాయంలో కార్పొరేషన్ రాజకీయం

- డిప్యూటీ మేయర్ వైసీపీ అభ్యర్థిగా శేఖర్ రెడ్డి!
- కూటమితో టచ్‌లో ఆ పార్టీ కార్పొరేటర్లు
- రెండు రోజుల్లో కూటమి అభ్యర్థి ఎంపిక

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయరు ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం నోటిఫికేషన్ ఇవ్వడంతో తిరుపతి కార్పొరేషన్ రాజకీయం రసకందాయంగా మారింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా 42వ డివిజన్ కార్పొరేటర్ ఎం.శేఖర్ రెడ్డిని ప్రకటించినట్లు తెలిసింది. ఈ సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు పెద్దఎత్తున డుమ్మాకొట్టినట్లు సమాచారం. కౌన్సిల్లో పాలకపక్షంగా ఉన్న వైసీపీకి సొంత పార్టీ కార్పొరేటర్లే తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 3న పరోక్ష పద్ధతిలో జరగనున్న ఎన్నికలకు ముందు క్యాంప్ రాజకీయాలకు తెరలేపనున్నట్టు సమాచారం. సమావేశానికి హాజరుకానివారిని స్థానిక వైసీపీ నాయకత్వం ఇప్పటికే గట్టిగా హెచ్చరికలు జారీచేసినట్టు తెలుస్తోంది. అవన్నీ పట్టించుకోకుండా కూటమి పార్టీ నేతలతో పలువురు వైసీపీ కార్పొరేటర్లు టచ్‌లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. మరోవైపు, కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తివున్న కార్పొరేటర్లతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడినట్టు తెలుస్తోంది. నేడో, రేపో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి వస్తున్నట్టు సమాచారం. ఈలోపు కూటమిలో చేరేందుకు ఆసక్తి ఉన్న కార్పొరేటర్లతో పాటు ప్రస్తుతం వైసీపీతో అసమ్మతిగా ఉన్నవారిని ఏకం చేసి మంత్రి సమక్షంలో కూటమిలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పుడే కూటమి నుంచి డిప్యూటీ మేయర్‌ను ఎవరిని నిలబెట్టాలనే నిర్ణయాన్నీ తీసుకోనున్నారు. మొత్తానికి రాబోయే ఐదురోజుల పాటు తిరుపతి రాజకీయం రంజుగా ఉండబోతోంది.

అందుబాటులోకి ఛార్జింగ్ స్టేషన్

తిరుమల, జనవరి28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో టీటీడీ వాహనాలకు విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. పది విద్యుత్ బస్సుల(ధర్మరథాలు)తో పాటు 35 కార్లు తదితరాలున్నాయి. వీటికి ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలోనే ఛార్జింగ్ పెడుతున్నారు. వాహనాల సంఖ్య పెరగడంతో ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మంగళ, బుధవారాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలించి.. ఫిబ్రవరి మొదటివారం నుంచి పూర్తిగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

పీజీ అడ్మిషన్ల బాధ్యత వర్సిటీలకే అప్పగించాలి: ఎస్ఎఫ్ఐ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పీజీ అడ్మిషన్ల నిర్వహణ బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలని ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండు చేశారు. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. ఈ దిశగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకోవాలని కోరారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ మాజీ నేత వందవాసి నాగరాజు మాట్లాడారు. తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా అక్బర్, రవి, కార్యవర్గ సభ్యులుగా ఉమేష్, ప్రవల్లిక, బాల, తేజ, గురవయ్య, వినోద్, అశోక్‌ను ఎన్నుకున్నారు.

'డిజిటల్ అరెస్టు' మోసంలో మరో ఆరుగురి అరెస్టు

రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారు నగలు స్వాధీనం



ల్యాప్‌టాప్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 28(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరిట తిరుపతిలోని మహిళను మోసం చేసిన కేసులో మరో ఆరుగురు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.32.5 లక్షలు, నగలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అరెస్టయిన నిందితుడిని విచారించడంతో ఈ ఆరుగురి విషయం బయటపడింది. ఈ వివరాలను మంగళవారం ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. విశాఖపట్నం త్రినాథపురానికి చెందిన సింగంపల్లి గణేష్, చిన్నవాల్తేరుకు చెందిన పాలకొల్లు రవికుమార్, కంచరపాలేనికి చెందిన యుల్లి జగదీష్, రామ్‌నగర్‌కు చెందిన ఆనంద్ సంతోష్‌కుమార్, పెందుర్తి మండలం ఎల్ఐసీ కాలనీకి చెందిన అమరనాథ్, మురళినగర్‌కు చెందిన కర్రి వాసుదేవ్ స్నేహితులు. కొన్నేళ్లుగా జులాయిగా తిరుగుతూ ఈజీ మనీకోసం పలువురిని మోసం చేసేవారు. ఇలా.. తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో ఫోను, వాట్సాప్ కాల్ చేశారు. తాము ఢిల్లీకి చెందిన సీబీఐ అధికారులమని, రూ.200 కోట్లు మనీ ల్యాండరింగ్.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు మీ బ్యాంకు ఖాతాల్లోని నగదు వినియోగించడంపై అరెస్టు చేయాల్సి ఉంటుందని బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాల్లోని నగదు తమకు పంపితే వాటిని పరిశీలించి మనీ ల్యాండరింగ్‌లో మీ పాత్ర లేకుంటే తిరిగి జమ చేస్తామని చెప్పారు. దీంతో ఆమె తన ఐదు ఖాతాల్లోని రూ.2.5 కోట్లను వారు చెప్పిన ఖాతాలకు పంపారు. దీనిపై వారు మళ్లీ స్పందించకపోవడంతో ఈ నెల 13న తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన వినయ్‌కుమార్‌ను ఈనెల 22న అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ఆరుగురు ఉన్నట్లు అతడు చెప్పడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు పర్యవేక్షణలో సైబర్ క్రైం సీఐ వినోద్, క్రైం.. వెస్ట్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సెల్ టవర్ ఆధారంగా నిందితులను పట్టుకుని అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. వారి నుంచి రూ.32.5 లక్షల నగదు, 141 గ్రాములు బంగారు నగలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్ టాప్‌లు, ఒక సిమ్ మాడ్యూల్స్, ఎనిమిది రూటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఓ నిందితుడి ఖాతాలోని రూ.10 లక్షలను ఫ్రీజ్ చేశారు. వీరంతా కంబోడియా వెళ్లి సైబర్ నేరాలపై శిక్షణ పొంది వచ్చినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రతిభ చూపిన వెస్ట్ సీఐ మురళీమోహన్, సైబర్ క్రైం సీఐ వినోద్, సీసీఎస్‌సీఐ ప్రకాష్, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీ శ్రీలత, సీఐలు, వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీవో కిషోర్‌బాబు, డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రవాణాశాఖ అధికారి కిషోర్ బాబు, డీఎస్పీ గీతాకుమారి అన్నారు. మగళవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సునీల్, జకీర్, సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ఏఈఎస్ ఊహశ్రీ

గూడూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు, గౌడ ఉపకులాల వారికి మద్యం షాపులు కేటాయించేందుకు చర్యలు తీసుకుందని ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఊహశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గూడూరు డివిజన్ పరిధిలో 12 మద్యం దుకాణాలకు కల్లుగీత కార్మికులు, గౌడ ఉపకులాల వారికి కేటాయించామన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కానీ, ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో కానీ నమోదు చేసుకోవచ్చునని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ కరీమాబేగం, సిబ్బంది అరుణకుమారి పాల్గొన్నారు.

బీరువా వితరణ



గూడూరు అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సైదాపురం మండలంలోని ఆర్‌ఆర్‌పురం గ్రామానికి చెందిన చందన అనే మహిళకు మంగళవారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయం వద్ద బలిజ మహిళా సంక్షేమసంఘం ఆధ్వర్యంలో బీరువాను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బలిజ మహిళాసంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పేదరాలైన చందన వివాహానికి తమ సంఘం ఆధ్వర్యంలో బీరువాను వితరణగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సారంగం సులక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

5లోగా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ ప్రసాద్

వాకాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వాకాడు సర్కిల్ పరిధిలోని కల్లుగీత కార్మికుల నుంచి 2 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ మంగళవారం తెలియజేశారు. వాకాడు, చిట్టమూరు మండలాలకు ఒకటి చొప్పున దుకాణాలను కలెక్టర్ కేటాయించారన్నారు. వాకాడుకి గౌండ్ల ఉపకులం వారికి, చిట్టమూరు మండలానికి గౌడ్ ఉపకులానికి కేటాయించినట్లు వివరించారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఆటవస్తువులు, వంట సామగ్రి పంపిణీ



వస్తు, సామగ్రి అందజేస్తున్న గాలి రమేష్ నాయుడు-జయప్రద దంపతులు

నాయుడుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట సప్తగిరికట్ట వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రానికి టీడీపీ నాయకుడు మాజీ సర్పంచ్ గాలి రమేష్ నాయుడు-జయప్రద దంపతులు వస్తుసామగ్రిని మంగళవారం అందజేశారు. వారి కుమారుడు లిఖిత్ జన్మదినం సందర్భంగా చిన్నారుల నడుమ కేక్ కట్‌చేసి వారికి పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు, పలకలు, ఆట వస్తువులు, వంటసామగ్రి తదితర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి రాజేష్ నాయుడు, ఉత్తమ మాజీ రాష్ట్ర ఉపాధ్యాయుడు మలిశెట్టి శివప్రసాద్, అద్దూరు రవి, శిరసనంబేటి గౌతం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రూ.కోటి మంజూరు

అడిగిందేమో రూ.6.12 కోట్లు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్వల్పమొత్తంలో నిధులు మంజూరు చేసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు రూ.6.12 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం గతేడాది నవంబరులోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఉత్సవాలు ముగిశాక ఇపుడు ప్రభుత్వం కేవలం రూ. కోటి మాత్రమే మంజూరు చేసింది.

ఆటోల్లో ఓవర్ లోడింగ్ వద్దు : ఎస్‌ఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివశంకర్

డక్కిలి, జనవరి 28 : (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు ప్రయాణికులు సీటు బెల్టు పెట్టుకోవాలని, స్కూలు ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను తరలించ రాదని ఎస్‌ఐ శివశంకర్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డక్కిలిలోని కాకతీయ జూనియర్ కాలేజీ విద్యార్థులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. లైసె న్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

30న జాబ్‌మేళా

దొరవారిసత్రం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీన దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైకెన్ ఎయిర్ కండిషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, సీడ్‌అప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారు అర్హులని వివరించారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేద్దాం

గూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు బీవీరమణయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆస్పత్రి రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, పెంచలయ్య, కిరణ్, శ్రీకాంత్, సురేంద్ర, ప్రశాంత్, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మందులు పిచికారి చేయాలి



తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ నాగార్జున సాగర్

డక్కిలి, జనవరి 28 : (ఆంధ్రజ్యోతి) : తెగుళ్ల నివారణకు రైతులు సకాలంలో క్రిమిసంహారక మందులు పిచికారి చేసుకోవాలని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాటుమడుగు, శ్రీపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు పంటలు సాగుపై అవగాహన కల్పించారు. డక్కిలి ఏవో విజయభారతి ఉన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి



పాడి రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

పెళ్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణలో పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ ఏడీ ధనుంజయులు తెలిపారు. మండలంలోని జీలపాటూరు పంచాయతీ దొడ్లవారిమిట్ట గ్రామంలో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. నట్టల నివారణ మందులు చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. ఎల్ఎస్‌ఏ బాలాజీ, విజయ, పశుసంవర్ధక సహాయకులు మిట్ట లతవ్యకుమార్, ప్రేమ్‌కుమార్, ప్రభావతి, నికోరాణి తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలో మంగళవారం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. చెన్నైవైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఖరగ్పూర్ సూపర్ ఫాస్ట్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నట్లు తెలిసింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే విజయశ్రీ



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే కమిటీ సభ్యులు సతీష్, హనుమంతరావు, సరిత

సూళ్లూరుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి హెచ్‌డీసీ చైర్మన్‌గా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సభ్యులుగా వైసతీష్, హనుమంతరావు, సరితలను ఎన్నుకొన్నారు. హెచ్‌డీసీ కమిటిచే ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, ఎంపీడీవో ప్రమీలా రాణి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన హెచ్‌డీసీ కమిటీని ఆస్పత్రి వైద్యబృందం, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, గాడి నారాయణరెడ్డి, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైన పెన్షనర్లకు వైద్య పరీక్షలు



నాయుడుపేటలో పింఛన్ దారులను పరీక్షిస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంచానికి పరిమితమైన పింఛన్ దారుల ఇళ్ల వద్దకే వెళ్లి సదరన్ టీమ్ వైద్యులు మంగళవారం పరీక్షలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మంచానికి పరిమితమైన పింఛన్ దారులు 27 మంది ఉండగా వారిలో 21 మందికి వైద్య పరీక్షలు చేశారు. రూరల్ మండలంలో 16 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య పరీక్షల నివేదికలను జిల్లా డీఎం అండ్‌హెచ్‌వోకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సీహెచ్ మధుసూదన్‌రావు, డాక్టర్ వెన్నెల, ఎల్ఏసాగరం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుబ్బారావు, గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అధికారులు ఉన్నారు.

వాకాడు: మండల వ్యాప్తంగా ఉన్న 12 మంది పెన్షనర్లను జిల్లా వైద్యాధికారులు పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, బాలిరెడ్డిపాళెం వైద్యాధికారి దీప్తి ఉన్నారు.

బహిరంగ ప్రదేశంలో మద్యం తాగరాదు



నాయుడుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాలలో మద్యం తాగడం నిషేధమని డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. మంగళవారం నాయుడుపేట, పరిసర ప్రాంతాలలో బహిరంగ, మారుమూల ప్రాంతాలలో మద్యపానం నిషేదం సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆయన వెంట అర్బన్ సీఐ బాబి తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. అక్షరజ్ఞానం



పుస్తకాలు చూపెడుతున్న అధికారులు

వాకాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అన్నపూర్ణరావు అన్నారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో 37 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో వయోజన విద్య కార్యక్రమంలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం గురించి వివరించారన్నారు. ప్రస్తుతం ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, కుటుంబసంక్షేమం, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి ప్రాథమిక విద్య, కలలు, శాస్త్రాలు, సాంకేతికత, సంస్కృతి, క్రీడలు, తదితరాలపై అవగాహన పెంచనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాధవి, సీసీలు రమణమ్మ, భూదేవి, సరోజనమ్మ, కృష్ణ, గున్నయ్య తదితరులు ఉన్నారు.

అంగన్వాడీల్లో కార్పొరేట్ విద్యపై ప్రచారం చేయాలి



అంగన్వాడీ వర్కర్లకు మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు బోధిస్తున్న కార్పొరేట్‌స్థాయి విద్యపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోటలోని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషక విలువలుతో కూడిన ఆహారం అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మెడికల్ కిట్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం ఆయా మండలాల్లో 225 అంగన్వాడీ కేంద్రాలకు వర్కర్లకు మెడికల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మజ ఉన్నారు.

జాతీయ రహదారిపై ఎల్‌ఈడీ వెలుగుల శోభ



చిల్లకూరు వద్ద హైవే మీద కాంతులీనుతున్న ఎల్‌ఈడీ లైట్లు

పెళ్లకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-రేణిగుంట మధ్య జాతీయ రహదారి అండర్ బ్రిడ్జిలపై ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. తాళ్వాయిపాడు గోమతిసర్కిల్ నుంచి నెలబల్లి వరకు ఈ విద్యుత్ దీపాలు ఆకర్షణీయంగా వెలుగులు ఇస్తున్నాయి. గతంలో రెండు వరుసల రహదారి ఉండటంతో అనేక ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆరు వరుసలుగా విస్తరించారు. తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు, భీమవరం, నెలబల్లి గ్రామాల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలపై ఎల్‌ఈడీ లైట్‌ల ఏర్పాటుతో వాహనదారులు సాఫీగా సాగుతూ గమ్యస్థానాన్ని చేరుకుంటున్నారు. కాగా అక్కగారిపేట, పెసల గుర్రప్పతోట వద్ద సర్వీస్ రోడ్డులు ఏర్పాటు చేయకపోవడంతో సుమారు 20 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి అథారిటీ అధికారులు స్పందించి సర్వీస్‌రోడ్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

తడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయ కుమార్ తెలిపారు. మంగళవారం తడకండ్రిగ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్‌లోని తప్పులు, చిరునామా మార్పు, కొత్తగా నమోదు వంటి సేవలు అందుతాయని వివరించారు.

విన్నమాలలో తాగునీటి బోరు ఏర్పాటు

నాయుడుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు ఎస్టీ కాలనీలో నీటి సమస్య ఉండటంతో మంగళవారం టీడీపీ నాయకులు తాగునీటి బోరు పనులు ప్రారంభించారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, విన్నమాలలో తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ తాగునీటి కోసం నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి దార్ల రాజేంద్ర, టీడీపీ నాయకులు మధురెడ్డి, రాజారెడ్డి, బత్తల దినేష్, శ్రీనివాసులు, శేఖర్, నాగరత్నం, బంగారయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను పేదలకు అందించండి

పెళ్లకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పేదలకు అందించాలని ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చిల్లకూరు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం కరోనా కష్టకాలంలోనూ ఇచ్చిన హామీలను అమలుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నాయకులు కరణం రఘునాయుడు, ఎల్లు మోహన్, తూముల కోటి, సాగి జితేంద్ర, బండి బాలు, అట్ల కృష్ణయ్య, గోపాల్, దయాకర్, శ్రీనివాస్‌రాజు, అశోక్, రమణయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక తరలింపుపై ఆందోళన

కోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్లపేరుతో స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ కోటలోని తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట తిన్నెలపూడి పంచాయతీ ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని తహసీల్దారు జయజయ రావుకు, ఎంపీడీవో వేణుకు వినతిపత్రం అందజేశారు. ఇసుక తరలింపునకు పంచాయతీ కార్యదర్శి ఎలా అనుమతులు ఇస్తారని గ్రామస్థులు ఎంపీడీవోను ప్రశ్నించారు. ఇకనుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కారు ఢీకొని అపెక్స్ ఉద్యోగి మృతి

చిల్లకూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోట క్రాస్ రోడ్డు సమీపంలో కారు ఢీకొని అపెక్స్ పరిశ్రమ ఉద్యోగి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదేశ్ (50) కోట క్రాస్‌రోడ్డు సమీపంలోని అపెక్స్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున విధులు ముగించుకుని రోడ్డు దాటు తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెలుతున్న కారు ఢీకొంది. తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యరూపం దాల్చని సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణం



విద్యానగర్, చెందోడు గ్రామాల వ్యూ

కోట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చెందోడు పంచాయతీ మజరాలోని విద్యానగర్‌లో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యాసంస్థలకు కేరాఫ్‌గా ఉన్న ఈ ప్రాంతం అటు చిట్టమూరు, నాయుడుపేట, వాకాడు, చిల్లకూరు మండలాలకు ప్రధాన కూడలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమల్లో పనిచేసే మహిళలు, విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకొని ఆయా ప్రాంతాలకు వెళ్తుంటారు. పలు మండలాల నుంచి పిల్లలు విద్యాభ్యాసం కోసం ఈ ప్రాంతంలో ఉంటున్నారు. ఇక్కడ మహిళల అవస్థలను దృష్టిలో పెట్టుకుని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆత్మగౌరవం పేరుతో సులభ్ కాంప్లెక్స్‌లు, మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదించింది. స్వచ్ఛంద సంస్థలకు ఈ కాంప్లెక్స్ నిర్వహణ బాధ్యత అప్పగించాలని అప్పటి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రతిపాదించారు. అయినా ఇప్పటివరకు సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. మరుగులేక మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే స్పందించి విద్యానగర్‌లో సులభ్‌కాంప్లెక్స్ నిర్మించాలని వీరు కోరుతున్నారు.

కోటను కమ్మేసిన మంచు దుప్పటి

కొక్కుపాడు సమీపంలో 9 గంటల వరకు విడవని పొగమంచు



వంజివాక సమీపంలో వరి పైరుపై ఇలా దట్టంగా కమ్ముకున్న మంచు



కోటతో పాటు పరిసర గ్రామాలను మంగళవారం మంచు కమ్మేసింది. వంజివాక, తిమ్మానాయుడుపాళెం, కొక్కుపాడు, తిన్నెలపూడి గ్రామాల్లో ఉన్న వరి పొలాలను మంచు కమ్మేసింది. ఉదయాన్నే కూలి పనులకు వెళ్లే వారు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా కోట, కొత్తపట్నంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మంచు ముసుగేసింది. వాహన దారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. 9 గంటలపైన సూర్యుడు రావడంతో జనం వెచ్చబడ్డారు. - కోట